ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

శుక్రవారం 21 నవంబరు 2025 | 5



ఎన్‌కౌంటర్‌లో స్వాధీనం చేసుకున్న తుపాకీని పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

సంభవ్.. కొనసాగింపు!

- 'ఆపరేషన్ సంభవ్' కొనసాగుతుందన్న డీజీపీ గుప్తా
- తూర్పు ఏజెన్సీలో వచ్చే ఏడాది మార్చి దాకా కూంబింగ్
- అడవుల్లో జల్లెడపడుతున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు
- పర్యాటకరంగంపై కొంత ప్రభావం

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి అంటే ఇప్పుడు చక్కటి పర్యాటక కేంద్రం. తెలుగురాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఇక్కడి అడవుల్లో పర్యటించేందుకు నిరంతరం వస్తుంటారు. వాగులువంకలు, దట్టమైన అడవులతో పచ్చని లోకాన్ని ఈ ప్రాంతం తలపిస్తుంది. అయితే రెండు దశాబ్దాల కిందట నక్సల్బరి ఉద్యమంలో కీలక నేతలకు ఈ ఏజెన్సీ ఒక షెల్టర్. తాము మారేడుమిల్లి అడవుల్లోనే ఆయుధ సామగ్రిని తయారుచేసే వారమని ఉద్యమం నుంచి బయటకు వచ్చిన టెక్ మధు ఇటీవల ఓ డిబేట్‌లో చెప్పారు. అంటే ఇది నక్సల్ ఉద్యమంలోనే కాకుండా ఆయుధ సంపత్తిని తయారుచేసే కేంద్రంగానూ ఉండేదని తెలుస్తోంది. సాంకేతికపరమైన శిక్షణ కోసం తూర్పు ఏజెన్సీ ముఖ్య కేంద్రంగానూ ఎంచుకున్నట్టు మాజీ నక్సలైట్లు అందించే సమాచారం తేటతెల్లం చేస్తోంది. ఏజెన్సీలో ఇరవైయేళ్ల కిందట ఐఏఎస్‌ల కిడ్నాప్ తర్వాత భారీగా కూంబింగ్ జరగడంతో ఏజెన్సీ నుంచి నక్సలైట్లు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. కానీ ఈ ఏడాదిలో మళ్లీ ఇప్పటివరకు జరిగిన నాలుగు ఎన్‌కౌంటర్లు నాటి రోజులను తలపిస్తున్నాయి. ఇక అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏడాది కాలంగా ముమ్మరంగా కూంబింగ్ జరుగుతోంది. తాజా ఘటనల నేపథ్యంలో చేపట్టిన కూంబింగ్ 'ఆపరేషన్ సంభవ్' మూడ్రోజుల తర్వాత ముగిసిందని ఎస్పీ అమిత్ బర్దర్ ప్రకటించారు. అయితే 'ఆపరేషన్ సంభవ్' 2026మార్చి వరకు కొనసాగుతుందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రకటించారు. గురువారం ఆయన రంపచోడవరంలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో వినియోగించిన ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంలోనే కేంద్రం నిర్దేశించిన లక్ష్యం మేరకు రాష్ట్రంలో మావోయిస్టుల అలజడి లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టంచేశారు. దీంతో రంపచోడవరం ఏజెన్సీలో ఇకపై ముమ్మరంగా కూంబింగ్ జరుగునుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు రంపచోడవరం ఏజెన్సీలో ప్రశాంతమైన వాతావరణం ఉండి పర్యాటకులకు విడిదిగా విలసిల్లుతుండగా.. కొద్ది నెలలపాటు భద్రతా దళాల బూట్ల చప్పుళ్లు, నిఘా వర్గాల కదలికలు, పోలీసు ఉన్నతాధికారుల పర్యటనలతో కొంత ఆందోళనకర పరిస్థితులు నెలకొనే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా ఏజెన్సీతోపాటు సమీపంలోని మైదాన ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్న మావోయిస్టుల గాలింపు చర్యలు సైతం ముమ్మరంగా సాగాలని డీజీపీ ఆదేశాలివ్వడంతో ఆమేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ విస్తృత తనిఖీలకు దిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకుల తాకిడిపై కొంత ప్రభావం చూపనుంది. కొంత కాలం ఈ ప్రభావం ఉండే అవకాశం ఉంది.

మన్యంలో పోలీస్ బాస్ పర్యటన

అల్లూరి మన్యం మారేడుమిల్లి అడవుల్లో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల ఫలితాలు, ఆపరేషన్ సంభవ్ పురోగతులను పరిశీలించేందుకు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం రంపచోడవరం వచ్చారు. ప్రత్యేక హెలీకాప్టర్ మీద ఆయన రంపచోడవరం డిగ్రీ కళాశాల మైదానంలో దిగి అక్కడి నుంచి రంపచోడవరం పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పాటుచేసిన ఎన్‌కౌంటర్లో స్వాధీనపర్చుకున్న ఆయుధాలు, పేలుడు సామగ్రి, ఇతర పరికరాల ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డాతోనూ, అల్లూరి జిల్లా ఎస్పీ బర్దర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. రెండు ఎన్‌కౌంటర్లు, మృతి చెందిన మావోయిస్టుల వివరాలపై ఆరా తీశారు. ఇంటిలిజెన్స్ చీఫ్ లడ్డా, అల్లూరి ఎస్పీ అమిత్‌బర్దర్ ఆయన వెంట ఉన్నారు.

నలుగురికి పోస్టుమార్టం

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్, దేవే, లక్మల్ అలియాస్ చైత్, మల్ల అలియాస్ మల్లాలలకు పోస్టుమార్టం నిర్వహించారు. మిగిలిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.



ఖరీఫ్ కోతలు ముమ్మరం

- మరోపక్క ధాన్యం కొనుగోలు వేగవంతం
- రబీకి సిద్ధమవుతున్న యంత్రాంగం
- 92,998 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులకు రూ.118.5 కోట్లు చెల్లింపు

రాజమహేంద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖరీఫ్ వరి కోతలు ముమ్మరం అయ్యాయి. మరోపక్క రబీ పంట సాగుకు కూడా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈనెలాఖరు నుంచి నారుమళ్లు ఊపందుకుంటాయి. డిసెంబర్ 20వ తేదీ నుంచి రబీనాట్లు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇటీవల రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, ప్రధాని కిసాన్ యోజన కింద ఒక్కో రైతు 7 వేల వంతున డబ్బు జమచేసిన సంగతి తెలిసిందే. మొత్తం జిల్లాలోని 1,14,991 మందికి రూ.77 కోట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమైంది. దీంతో రైతుల్లో కూడా ఉత్సాహం పెరిగింది. ప్రస్తుతం ఖరీఫ్ రైతాంగం ధాన్యం మాసూళ్లలో నిమగ్నమైంది. జిల్లాలో సుమారు 75 వేల హెక్టార్లలో ఖరీఫ్ వరిసాగు చేశారు. దాని ద్వారా సుమారు. 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా. అందులో ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. ఇప్పటికి జిల్లాలో 21,766 .59 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లోకి ఒక లక్షా 25వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం సిద్ధంగా ఉంది. డిసెంబరు మొదటివారంలో కోతలు పూర్తవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ప్రస్తుతం బిక్కవోలు మండలంలో 4092 హెక్టార్లు, ఉండ్రాజవరంలో 1800, పెరవలిలో 500, రాజమహేంద్రవరం రూరల్‌లో 281.59 హెక్టార్లు, కొవ్వూరులో 198, తాళ్లపూడిలో 305, రంగంపేటలో 800, నిడదవోలులో 2500, దేవరపల్లిలో 300, గోకవరంలో 500, చాగల్లులో 1200, గోపాలపురంలో 1000, అనపర్తిలో 3010, నల్లజర్లలో 1300, రాజానగరంలో 2800, కడియంలో 500, కోరుకొండలో 80, సీతానగరంలో 600 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి.

183 కొనుగోలు కేంద్రాల నుంచి..

జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం అయింది. జిల్లాలో మొత్తం నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకూ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 183 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 12,766 మంది రైతుల నుంచి 92,988.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. వీటికి సంబంధించి రైతు నుంచి కొనుగోలుచేసిన 48 గంటల్లోపే 6,750 మంది రైతులకు రూ.118.5 కోట్లు చెల్లించారు.



నాడు గాలికి.. నేడు దారికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచిరోజులు వచ్చాయి. అప్పట్లో వీటికి కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్లించి భవనాల నిర్మాణాన్ని గాలికి వదిలేయడంతో అవన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వం వీటికి శాశ్వత భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చింది. అసంపూర్తిగా వదిలేసిన వాటిని, అసలు భవనాలే లేని క్లినిక్‌లకు శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 39 క్లినిక్‌లకు శాశ్వత భవనాలకు రూ.11.50 కోట్ల నిధులు కేటాయించింది. మరో వారంలో కోనసీమలో 56 భవనాలకు రూ.23 కోట్లు కేటాయించబోతోంది. ఇక తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు రూ.12 కోట్లతో మరిన్ని భవనాల నిర్మాణం చేపట్టడానికి సన్నద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో వీటి నిర్మాణం ద్వారా పేదలకు ఇంటికి సమీపంలోనే వైద్య సేవలు అందేలా చేయడానికి కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది. మరోవైపు విలేజ్ క్లినిక్‌ల ద్వారా సమర్థవంతంగా వైద్య సేవలు అందించేలా రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది.

- ఉమ్మడి జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచి రోజులు
- వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- కాకినాడ, కోనసీమల్లో 39 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.11.50 కోట్లతో టెండర్లు
- మరో వారంలో కోనసీమలో రూ.23 కోట్లతో 56 క్లినిక్‌లకు టెండర్లు జారీ
- తూర్పు, కాకినాడ జిల్లాల్లో మరో రూ.12 కోట్లతో భవనాల నిర్మాణానికీ సన్నద్ధం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభించింది. వీటిలో పేదలకు 14 రకాల వైద్య సేవలు అందుతాయని ప్రకటించింది. అందులోభాగంగా ఉమ్మడి జిల్లాలో 1,050కిపైగా వీటిని మంజూరు చేసింది. ఇందులో కాకినాడ జిల్లాలో 410, తూర్పుగోదావరి జిల్లాలో 368 వరకు ఉన్నాయి. అయితే వీటిలో సగం క్లినిక్‌లకు శాశ్వత భవనాలే లేవు. చాలావరకు సచివాలయాలు, పంచాయతీల్లో నిర్వహించి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. నిజానికి వీటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. చివరకు వీటిని కూడా అప్పటి జగన్ సర్కారు నిధులు దారి మళ్లించేసింది. దీంతో అనేక క్లినిక్‌లకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవు. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా క్లినిక్‌లకు అసలు ఇప్పటికీ సొంత భవనాలు లేక అద్దె, లేదా వేరే పంచన నడుస్తున్నాయి. దీంతో సేవలు కూడా గ్రామీణ ప్రజలకు సరిగ్గా అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్రంతో మాట్లాడి నిధులు రప్పించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కేంద్రం 80 శాతం వరకు నిధులు సమకూర్చుతోంది. వీటిని 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' పేరు నామకరణం చేసింది. ఇందులోభాగంగా అసంపూర్తిగా ఉన్నవి, అద్దె భవనాల్లో ఉన్న వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో తాజాగా 39 హెల్త్‌క్లినిక్‌లకు శాశ్వత భవనాలు మంజూరు చేస్తూ రూ.11.50 కోట్లు విడుదల చేసింది. తుని మండలం ఎస్.అన్నవరం4 క్లినిక్‌కు రూ.28.98 లక్షలు, ఎస్.అన్నవరం-1కు రూ.29.09 లక్షలు, పిఠాపురం మండలంలో నరసింగపురం క్లినిక్‌కు రూ.29.37లక్షలు, గొల్లప్రోలు మండలం మల్లవరం రూ.29.36 లక్షలు, తాటిపర్తి రూ.29.12, తాటిపర్తి-2 రూ.29.13 లక్షలు, పెదపూడి మండలం గండ్రేడు రూ.27.87, రాజుపాలెం రూ.27.75, ఏపీత్రయం రూ.29.69, దోమాడ రూ.27.06, కాజులూరు మండలం కోలంక-2 రూ.29.34 లక్షలు, ఉప్పుమిల్లి రూ.29.59, పల్లిపాలెం2 రూ.29.19, ప్రత్తిపాడు మండలం శంకర్లపూడి రూ.29.03 లక్షలు, ఏలేశ్వరం మండలం ఎర్రవరం-1 రూ.28.83, లంపకలోవ రూ.29.03, సామర్లకోట మండలం వేట్లపాలెం-1 రూ.29.05, మాధవపట్నం రూ.29.24, పెద్దాపురం మండలం కాండ్రకోట రూ.28.68లక్షలు, మర్లోవ రూ.28.85, కరప మండలం పెనుగుదురు రూ.29.51 లక్షలు, కరప రూ.29.36, రౌతులపూడి గుమ్మరేగుల రూ.29.31, కాకినాడ-1 రూ.29.58లక్షలు, రమణయ్యపేట రూ.29.57, వలసపాకల రూ.29.54, సూర్యారావు పేట రూ.29.41, కొవ్వూరు రూ.29.65, తూరంగి 29.58, తూరంగి-22 రూ.29.58, తూరంగి-4 రూ.29.58లక్షలు, యు.కొత్తపల్లి రూ.29.38, పొన్నాడ రూ.29.38 లక్షలు మంజూరు చేసింది. కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పోతవరం క్లినిక్‌కు రూ.29.21లక్షలు, రామచంద్రపురం మండలం ఉండూరుకు రూ.29.58, వెలంపాలెం రూ.29.63. కె.గంగవరం-2 రూ.29.22, కె.గంగవరం మండలం దంగేరు క్లినిక్‌కు రూ.29.24, ముమ్మిడివరం మండలం కొత్తలంకకు రూ.28.81లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ క్లినిక్‌లను ఏడాదిలోగా పూర్తి చేసేలా తాజాగా ప్రభుత్వం టెండర్లు జారీచేసింది. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో వీటి నిర్మాణం పూర్తికానుండగా, ఈనెల 26లోగా వీటికి టెండర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లను కోరింది.

త్వరలో మరిన్ని..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వెయ్యికిపైగా ఉన్న హెల్త్ క్లినిక్‌ల్లో 30శాతం పునాదులు, శ్లాబ్ సాయిలో మూడేళ్ల నుంచీ అప్పటి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయాయి. వీటిని కూడా ఇప్పుడు ప్రభుత్వం పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అటు శాశ్వత భవనాల నిర్మాణంపైనా దృష్టిసారించింది. మరో వారంలో కోనసీమ జిల్లాలో రూ.23 కోట్లతో 56 హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించేలా ప్రభుత్వం టెండర్లు పిలవబోతోంది. అలాగే తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో రూ.12 కోట్లతో మరికొన్ని భవనాల నిర్మాణం చేపట్టనుంది. సగంలో నిలిచిపోయిన క్లినిక్‌లు ఉమ్మడి జిల్లాలో 250కిపైగా పూర్తి చేయడానికి అనుమతులు జారీ చేయనుంది. చాలాభవనాలకు స్థలాలు కూడా లేకపోవడంతో వీటిని కూడా కొన్ని నెలల కిందట ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు. మరో పక్కఈ క్లినిక్‌ల్లో ఉండాల్సిన సిబ్బంది కూడా గత ప్రభుత్వంలో చాలాచోట్ల లేరు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా ఏఎన్‌ఎం, ఆశావర్కర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి.. వీరంతా ఆయా గ్రామాల్లోని క్లినిక్‌ల్లో ఓపీ సేవలు అందించనున్నారు.



రాజమహేంద్రవరంలో రివర్ ఫ్రంట్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి, కమిషనర్ రాహుల్‌మీనా

వైసీపీ పాపాల పనులు శాపాలుగా మారాయి

- రాళ్లు పేర్చి ప్రమాదాలకు నెలవుగా జంక్షన్లను మార్చారు
- కూటమి హయాంలో టూరిస్ట్ హబ్‌గా రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కమిషనర్ మీనా

రాజమహేంద్రవరంసిటీ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాయకుల పాపాల పనులు ప్రజలకు శాపాలుగా మారాయని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శించారు. గురువారం రాజమహేంద్రవరం గోదావరి బండ్‌పై నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులను కమిషనర్ రాహుల్‌మీనాతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల వివరాలు ఆరా తీశారు. వేగంగా నాణ్యతతో ఈ పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం పుష్కరాలరేవు, దేవీచౌక్‌లలో గతంలో నిర్మించి రాళ్ల పేర్పు కూడళ్లను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడారు.. మాజీ ఎంపీ భరత్‌రామ్ సొంత అజెండాతో పనిచేసి దేవీచౌక్, పుష్కరఘాట్‌లలో రాళ్లు పేర్చారని, దీనివల్ల ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అలాగే తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ప్రజల కోరిక మేరకు హ్యాపీస్ట్రీట్ తొలగించామని, ఈ రాళ్ల విషయంలో విజిలెన్స్ విచారణ జరిగిందని, త్వరలో వీటికి మోక్షం కలుగుతుందన్నారు. రాళ్లపేర్పు ప్రజాధనం దుర్వినియోగం చేశారని చెప్పారు. ఇక గోదావరి బండ్‌పై నిర్మిస్తున్న రివర్‌ఫ్రంట్ మంచి టూరిస్ట్ హబ్‌గా మారుతుందన్నారు. కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి గోదావరి రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామన్నారు. జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎంపీ భరత్‌రామ్ పబ్లిసిటీ పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం చేశాడన్నారు. అధికార మదంతో నగరాన్ని అస్తవ్యస్థంగా మార్చాడని, కూటమి ప్రభుత్వం వాటిని సరిచేసేందుకు కృషిచేస్తోందన్నారు. ఉమామార్కండేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యిన్నమూరి దీపు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి



కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

- పబ్లిక్ స్థలాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు
- అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యంపై నివేదికలివ్వాలి
- జిల్లాలో వ్యవసాయ మార్కెట్ సెస్ వసూళ్లు వేగవంతం చేయాలి
- కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష

రాజమహేంద్రవరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ ప్రభుత్వశాఖ తమ పనితీరును మెరుగుపరచుకోవాలి. ఈ పనితీరును రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. శాఖల వారీగా గ్రేడింగ్ ఉంటుంది. ర్యాంకు పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం పలు ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ప్రాధాన్యతాంశాలపై సమీక్షించారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న అన్ని సేవల్లోనూ పారదర్శకత, వేగం, నాణ్యత పెరగాలన్నారు. గ్రామీణ నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో రూ.3 లక్షల వ్యయంతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నారని, స్వచ్ఛభారత్ మిషన్ గ్రాంటు ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్లేస్‌లలో ప్రజల సౌకర్యార్థం ఈ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నామని, ఒక్కో కాంప్లెక్స్‌లో 2 టాయిలెట్లు, 2 యూరినల్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం కోఆర్డినేషన్ మీటింగ్ ఉంటుందని, దీన్ని ఐసీడీఎస్, మెడికల్ ఆఫీసర్లు కలసి నిర్వహించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, పిల్లందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ఎంత మంది శ్యాం, మ్యామ్ లోపాలుగల పిల్లలు ఉన్నారో గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లాలో డెలివరీలు అధికంగా జరిగే ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు, మాతృ మరణాలు చోటు చేసుకున్న ఆసుపత్రుల వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా సెస్ వసూలు లక్ష్యాలు పెంచాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.34.31 కోట్ల వార్షిక వసూళ్ల లక్ష్యంగా ఉండగా, అక్టోబరు నాటికి కేవలం రూ.13.13 కోట్లు మాత్రమే వసూలు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వసూళ్ల వేగవంతం చేయాలని గోపాపులరం మార్కెట్ కమిటీలో ఈ-నామ్ పథకం అమలుచేయాలని ఆమె ఏడీని ఆదేశించారు. నిత్యావసర సరుకులు, వినియోగదారులు వినియోగించే ఉత్పత్తులు మార్కెట్లకు తీసుకుని రావడంలో సిబ్బంది చొరవచూపాలని చెప్పారు. రైతులకు తగిన ప్రోత్సాహం అందించాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీఆర్వో టి. సీతారామమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, కేఆర్‌ఆర్‌సీ, ఎస్డీసీ ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, పీపీవో ఎల్.అప్పలకొండ, జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కేఎన్ జ్యోతి, ఐసీడీఎస్ పీడీ టి.శ్రీదేవితోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆఫర్!

హైదరాబాద్ ఇంద్ర ఏసీ బస్సు టిక్కెట్‌పై 15 శాతం రాయితీ

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇంద్ర ఏసీ బస్సు టిక్కెట్‌లో 15 శాతం రాయితీ ఇచ్చారు. హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్సు టిక్కెట్ ఛార్జీతో ఇంద్ర ఏసీ బస్సులో ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు. ఇంద్ర ఏసీ బస్సు సాధారణ టిక్కెట్ ధర రూ.1060 కాగా ప్రయాణ ఛార్జీలో 15 శాతం రాయితీతో టిక్కెట్ ధర రూ.920 మాత్రమే అని ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ రాయితీ డిసెంబరు 31వ తేదీ వరకూ అందుబాటులో ఉంటుందని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అక్రమంగా ఇసుక తరలింపు లారీకి రూ.లక్ష జరిమానా

కొవ్వూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీకి రూ.లక్ష జరిమానా విధించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. గణపవరం మండలం పిప్పరకు చెందిన లారీడ్రైవర్ కొడమంచిలి రాజేంద్రబాబు ఏపీ39 యూఎల్0005 నెంబర్ గల లారీలో కొవ్వూరు మండలం వాడపల్లి నుంచి నిడదవోలు వైపునకు ఇసుక రవాణా చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం సీతంపేట వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా పట్టుబడ్డాడు. దీంతో లారీని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పగించారు. దీంతో రూ.లక్ష జరిమానా విధించారు.

డిసెంబరు మొదటివారంలో పోలవరం నిర్వాసితులతో షర్మిళారెడ్డి భేటీ

పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులతో వచ్చేనెల మొదటి వారంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి భేటీ కానున్నారని ప్రాజెక్టు నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు 89 వేల మందికి ప్రభుత్వ పరిహారం చెల్లించాలన్నారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లని, దీనివల్ల 89 వేలమంది నిర్వాసితులవుతారన్నారు. వీరందరికీ రూ.55 వేల కోట్లు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని వివరించారు. కానీ ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి 38 వేల మంది నిర్వాసితులకు రూ.38 వేల కోట్లు మాత్రమే నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయమని అన్నారు. కానీ రూ.25 వేల కోట్లు ఎగవేయడానికి కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ బాధితుల పక్షాన పోరాడుతుందని, అందులోభాగంగానే తమ నాయకురాలు షర్మిళారెడ్డి వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లు ఉంచకపోతే గ్రావిటీ ద్వారా రెండు కాలువల నుంచి వైజాగ్, కృష్ణా జిల్లాలకు సహజంగా నీరు వెళ్లకపోవడమే కాకుండా నీటి నిలువ సామర్థ్యం తగ్గించడం వల్ల జలవిద్యుత్ కేంద్రానికి సరిపడా నీళ్లు వెళ్లకుండా జలవిద్యుత్పత్తి జరగదన్నారు. అప్పుడు జలవిద్యుత్ కేంద్రం నిరుపయోగం అవుతుందన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ పాల్గొన్నారు.


ములగపూడి కొండపై పురాతన కోదండ రామాలయం

మరో భద్రాద్రి

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడిలో ఎత్తయిన కొండపై కోదండరాముని పురాతన ఆలయం ఉంది. దీనిని 13-14 శతాబ్దాల మధ్య నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్లో ఇక్కడ శ్రీరామనవమిని అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. ఈ ఆలయాన్ని చాలా కాలంగా పట్టించుకోలేదు. గ్రామానికి చెందిన కొందరు కమిటీగా ఏర్పడి కొంచెంకొంచెంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రతిఏటా శ్రీరామనవమితో పాటు కార్తీక పౌర్ణమి నాడు తెప్పోత్సవం, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి రోజున గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. భక్తులు వేలాదిగా హాజరవుతున్నారు.

- ములగపూడిలో కొండపై 14వ శతాబ్దం నాటి కోదండ రామాలయం
- చరిత్ర ఘనం... ఆదరణ శూన్యం
- గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి
- ప్రతిఏటా కార్తీక పౌర్ణమినాడు తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణ

(రౌతులపూడి-ఆంధ్రజ్యోతి)

14వ శతాబ్దంలో రాఘవపట్నాన్ని పరిపాలించిన రాఘవరాజు ములగపూడిలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఆలయ శాసనాలు తెలుపుతున్నాయి. భద్రాద్రిలో ఉన్నట్టుగానే ఇక్కడ కూడా ఏకశిలపై సీతారాములు ఉండడంతో మరో భద్రాదిగా పేరొందింది. ఆలయం కింద రాతి కట్టడం ఆధారంగా 13-14 శతాబ్దాల మధ్య ఆలయ నిర్మాణం జరిగినట్టు గుర్తించారు. ఉపయోగించిన ఇటుకలు, రాతితో నిర్మించిన ద్వారం, విగ్రహం పురాతన ప్రాశస్త్యాన్ని, గొప్పదనాన్ని చాటి చెప్తున్నాయి. రాతితో చేసిన నీటి తొట్టెలు, హోమ గుండాలు మొదలైన వాటి ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయి. ఆలయ సమీపంలోని వేగులమ్మ వారి పీఠంలో ఉంచిన చిహ్నాలను చోళుల కాలం నాటివిగా చెప్తున్నారు. రాఘవరాజు నిర్మించిన 162 ఎకరాల చెరువు ద్వారా వేలాది వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ దేవాలయాన్ని సందర్శించినట్టు పూర్వీకులు చెప్పేవారు. మహ్మదీయుల దండయాత్రలో ఈ ఆలయం శిథిలమైనట్టు ఓ కథనం ప్రాచుర్యంలో ఉంది.


సీతారాముల ఏకశిలా విగ్రహం


రాతి కట్టడంతో నిర్మించిన ఆలయ గోపురం లోపలి భాగం


వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు (పాత చిత్రం)

అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఆలయ కమిటీ విన్నపం

మేమంతా కష్టపడి మెట్ల మార్గం, రహదారి నిర్మించుకున్నాము. రామయ్యకు పూజలు చేసుకుంటున్నాము. ఆలయం కూలిపోయే స్థితిలో ఉంది. ఆలయ పునర్నిర్మాణానికి గతంలో దేవదాయ శాఖ రూ.75లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు రావాలంటే సొంతంగా రూ.18లక్షలు కాంట్రిబ్యూషన్ చెల్లించాలి. అంత మొత్తం కట్టే స్థితిలో లేము. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలి.


16X24 సైజులో లభ్యమైన ఇటుక


కొండపై కనిపిస్తున్న అలనాటి నీటి కుండీ



తేగలు... ఆరోగ్య దీపికలు

- ధర తక్కువ... ఔషధ గుణాలు ఎక్కువ
- ఈ ఏడాది ముందుగానే మార్కెట్‌లోకి

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

పూర్వీకులకే కాదు ఆధునికులకూ ఆరోగ్య ప్రదాయిని. శీతాకాలంలో ప్రజలు తినే శాఖాహారమిది. తాటి చెట్లు కనుమరుగవుతున్నప్పటికీ డిసెంబరు, జనవరి నెలల్లో విస్తారంగా దొరుకుతుంది. అదే 'తేగ'. తాటి మొలకేనన్న విషయం చాలా మందికి తెలియదు. సంక్రాంతి పండుగ రోజుల్లో గ్రామాల్లో దర్శనమిచ్చే తేగలు ఈ ఏడాది నవంబరు ప్రారంభం నుంచే మార్కెట్లో కనిపిస్తున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులతో తాటిపండ్లను ముందుగా నాటడంతో పక్వానికి వచ్చి నవంబరు మొదటి వారానికే తేగలు అందుబాటులోకి వచ్చాయని గ్రామీణ ప్రాంతాల ప్రజలు చెప్తున్నారు.

నగరాలకు ఎగుమతి: ఒకప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తేగలకు చాగల్నాడు ప్రసిద్ధి. దీంతో చాగల్నాడు ప్రాంతాలను ఈ సీజన్లో తేగల్నాడు అని కూడా ముద్దుగా పిలుచుకునేవారు. పెద్దాపురం, రంగంపేట, జగ్గంపేట, రాజానగరం, కిర్లంపూడి, సీతానగరం, కోరుకొండ ప్రాంతాలకు చెందిన వారు తేగలను తీసుకెళ్లి జాతీయ రహదారిపై వెళ్లే లారీల్లోను, విశాఖ, విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లలోను విక్రయిస్తారు. బస్టాండ్లలోనూ విక్రయిస్తూ ఈ సీజన్లో ఎందరో జీవనోపాధి పొందుతారు. నాలుగు తేగలు కేవలం రూ.20 మాత్రమే. తేగల ప్రయోజనాలను గుర్తించిన మన పూర్వీకులు వాటి ఉత్పత్తికి పొలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు.

అన్ని వయసుల వారిలో రోగ నిరోధక శక్తిని పెంచే లక్షణాలు తేగల్లో ఉన్నాయని పోషకాహార నిపుణులు చెప్తున్నారు. తేగలలో బి1, బి2, బి3, సి విటమిన్లు, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఒమెగా, ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. తేగలు తిన్న వెంటనే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగుల్లో చేరిన మలినాలు తొలగిపోతాయి. ఎముకలు, దంతాలు దృఢపడతాయని గ్రామీణుల విశ్వాసం. చలికాలంలో తేగలు తింటే రక్తహీనత సమస్య పరిష్కారమవుతుంది. తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. తేగలు తింటే మెదడు కూడా చురుకుగా పనిచేస్తుంది. ఎన్నో ప్రయోజనాలున్న తేగలను పెద్దాపురం, రంగంపేట ప్రాంతాల నుంచి పలువురు తీసుకొచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం. తక్కువ ధరకు లభించే తేగలను మీరు కూడా ఈ సీజన్లో తినండి మరి.



ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో రాజశేఖర్‌కు స్వర్ణపతకం


దేవరపల్లిలో రాజశేఖర్‌ను సత్కరిస్తున్న జేఏసీ కమిటీ సభ్యులు, తదితరులు

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం గౌరీపట్నంకు చెందిన గెల్లా రాజశేఖర్ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొని స్వర్ణపతకం సాధించినట్టు గురువారం ఆయన విలేఖరులకు తెలిపారు. ఈ సందరంగా దేవరపల్లిలో మాట్లాడుతూ భూటాన్ దేశం థింపూలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన ఎస్‌టీకేఎఫ్ 12వ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ఇంకా మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించటమే తన కోరికన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగిన చదరంగ పోటీల్లో తాను పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించానని తెలిపారు. కాగా, ఇటీవల గోవాలో జరిగిన చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించానని, నెల్లూరులో జరిగిన పోటీల్లో వివిధ బహుమతులు సాధించినట్టు తెలిపారు. తాను చదరంగం పోటీల్లో ఎంతో శిక్షణ పొంది దీన్ని సాధించినట్టు తెలిపారు. భారత్ తరపున అంతర్జాతీయ స్థాయిలో చెస్ పోటీల్లో పాల్గొని గౌరవం తీసుకురావాలనే తపన తనలో ఉందన్నారు. ప్రస్తుతం తాను రాజమండ్రిలోని గోల్డ్‌జిమ్‌లో ప్రథమ కోచ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు రాజశేఖర్‌ను గురువారం దేవరపల్లిలో జేఏసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు దున్న సుమన్ బాబు, పచ్చా రామ్‌గోపాల్, మడతల శంకరం, ముప్పిడి భాస్కర్‌కుమార్, పల్లికొండ సురేశ్‌కుమార్, రాపాక అబ్బులు, మల్లిపూడి శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి మాతకు పంచహారతి


వృద్ధగౌతమికి కుండలేశ్వరంలో గంగాహారతి ఇస్తున్న దృశ్యం



కాట్రేనికోన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కుండలేశ్వరం వద్ద గోదావరిమాతకు గురువారం రాత్రి వైభవంగా పంచహారతి నిర్వహించారు. సాయంత్రం శ్రీపార్వతీకుండలేశ్వరస్వామి, శ్రీరుక్మిణీసత్యభామసమేత వేణుగోపాలస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ, ఆంజనేయ స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆచార్యత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో పంచహారతి పుడకలతో మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా వృద్ధగౌతమీ నదీ తీరానికి వెళ్లారు. తర్వాత సంప్రదాయబద్ధంగా పంచహారతి నిర్వహించారు. నక్షత్ర, కుంభ , నాగ, బిల్వ, పంచహారతి నిర్వహించారు. గంగుమళ్ల నిరంజనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రాజశేఖర్‌తో పాటు పలువురికి సన్మానాలు చేశారు. కార్యక్రమంలో దాట్ల పవన్, త్సవటపల్లి నాగేంద్ర, త్సవటపల్లి శ్రీను, పీఎస్ఎన్ రాజు, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, ఆకాశం శ్రీను, గంగుమళ్ల రవి శంకరకుమార్, గోకరకొండ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల నేరాలపై నియంత్రణకు చర్యలు

- ఐజీ అశోక్‌కుమార్
- ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ద్రాక్షారామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ మధ్యకాలంలో చిన్నపిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టామని ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. తర్వాత స్థానిక విలేకరులతో మాట్లాడారు. చిన్నపిల్లలపై జరిగిన నేరాలలో కేసులను త్వరగా విచారణ జరుపుతామన్నారు. చార్జీషీట్ కూడా దాఖలు చేసి ట్రయల్ అనుసరిస్తూ ముద్దాయిలకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ముఖ్యం గా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. శక్తి అలాగే గ్రామ మహిళా కార్యదర్శులతో కలసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో మహిళా టీచర్లకు శిక్షణ ఇవ్వాలని ఎస్పీలకు సూచించడం జరిగిందన్నారు. ఈయనతో ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ ఎస్.రఘువీర్, సీఐ ఎంవీ నారాయణ, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ద్రాక్షారామ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజలు

అంతకుముందు ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

డీఎస్పీ కార్యాలయం తనిఖీ

రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయంలో నమోదైన కేసుల ఫైళ్లను పరిశీలించారు. దీనిలో భాగంగా పెండింగ్ కేసులు స్థితిగతులు, దర్యాప్తు పురోగతి గురించి ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు

రౌతులపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రౌతులపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో రౌతులపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పైల శ్రీనివాస్ షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, గాడి రమణమ్మ డిస్కస్‌త్రో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, చైర్మన్ షేక్ సలీం, ఎంఈవోలు సతీష్‌బాబు, కొండబాబు, వ్యాయామోపాధ్యాయులు సుర్ల కృష్ణవేణి, అడిగర్ల మమత, తదితరులు అభినందించారు.

రంగంపేట: రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భాగంగా ఈనెల 18న కాకినాడలో జిల్లా స్థాయి (ఉమ్మడి జిల్లా) జరిగిన 100 మీటర్ల రన్నింగ్, ట్రిపుల్ జంప్‌లో యవ్వన లక్ష్మి, ట్రిపుల్ జంప్‌లో జాహ్నవి, 110 మీటర్ల హార్డిల్స్‌లో జాహ్నవి, సాయివీరలక్ష్మి, పోల్‌వాల్ట్‌లో ప్రసన్న, స్వర్ణ, సత్యనారాయణ ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరు ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండ జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీలు శైల, వీరబాబు, బూరిబాబును, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావును హెచ్ఎం అభినందించారు.


అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రౌతులపూడి హైస్కూల్ విద్యార్థులు



రంగంపేటలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారధి

కాకినాడలో ఘనంగా మహా కుంభాభిషేకం

- శివనామస్మరణతో మార్మోగిన సాగర తీరం

కాకినాడ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హరిహర మహాదేవ నామస్మరణతో కాకినాడ సాగర తీరం గురువారం మార్మోగింది. ఆదికుంభేశ్వరస్వామి ఆలయం వద్ద 50 వ మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. భారత యజ్ఞ పీఠం కమిటీ ఆధ్వర్యంలో శివభక్తుడు నామన రామచంద్రరావు కుటుంబ సభ్యులు ఉదయం గణపతి పూజతో ప్రారంభించి గోపూజ, ఆదికుంభేశ్వరునికి అభిషేకం, అనంతరం కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు, పాదరస లింగానికి మహా కుంభాభిషేకం జరిపారు. సాయంత్రం 108 మంది కన్యలతో అభిషేకం చేసిన ద్రవ్యాలను సాగరంలో నిమజ్జం చేశారు. కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు (బాబీ) దంపతులు ప్రత్యేక పూజలతో పాటు స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపి మహిళలకు పసుపుతాళ్లు, పురుషులకు రుద్రాక్షలు అందజేశారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ (రామ సేన) అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు బీజేపీ నేతలు యెనిమిరెడ్డి మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, తోట పృథ్వీరాజ్, గంధం పల్లవరాజు, కమిటీ సభ్యులు బోగిరెడ్డి తాతారావు, సలాది శ్రీనివాసరావు, ఆరుముగం నటరాజ్, గంగిరెడ్డి అరుణ, నామన ప్రసన్న, బూర్ల మాత, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూచన మేరకు కాకినాడ కుంభాభిషేకం రేవు పాటదారులు, బోట్ల యజమానులు, వర్తక సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో పది వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, నాయకులు ఎరిపిల్లి రాము, పి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



వివిధ ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు జరుపుతున్న దృశ్యం



దర్శనం కోసం వేచియున్న భక్తులు

గోదావరి యానాం.. అత్యద్భుతం

సూర్యాస్తమయం.. అటుపై గోదావరి తీరం.. ఎటుచూసినా పసుపుమయం.. కాసేపటికి వచ్చెను ఎరుపువర్ణం.. యానాం రాజీవ్ గాంధీ బీచ్‌లో గౌతమీ గోదావరి వద్ద గురువారం కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– యానాం (ఆంధ్రజ్యోతి)



ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్

-అంజమ్మ, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



రంపచోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లు ముమ్మాటికీ బూటకమేనని, మావోయిస్టులను పోలీసులు పట్టుకొని తీసుకువచ్చి మారేడుమిల్లి అటవీప్రాంతంలో కాల్చేశారని, ఇది ముమ్మాటికీ రాజ్య హింసేనని, పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను తక్షణం కోర్టులో హాజరుపర్చాలని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ కోరారు.

బాల్యం నుంచే ఉద్యమం బాట

-మధుసూదన్‌రావు, టెక్ శంకర్ సోదరుడు



మూడో తరగతి చదువుకునేరోజుల్లోనే తన సోదరుడు టెక్ శంకర్ ఉద్యమబాట పట్టాడు. దొరికిపోయి చనిపోయాడని కొందరు, ఎదురు కాల్పుల్లో చనిపోయాడని కొందరు చెబుతున్నారు. బ్రతికి ఉంటే సంతోషించేవారం. ఇటీవల అమ్మ చనిపోయింది. ఇప్పుడు అన్నయ్య(టెక్ శంకర్) ప్రాణాలతో ఉంటే సంతోషించేవారం. ఎన్‌కౌంటర్‌లో అన్నయ్య చనిపోయాడని తమకు పోలీసులు సమాచారం ఇచ్చేవరకు తెలియదు. ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయి. ఏం జరిగిందో పోలీసులకే తెలియాలి. వారి రాజ్యం వారి ఇష్టం. మృతదేహాన్ని ఇస్తే తీసుకెళ్లిపోతాం.

సత్యదేవుడికి రూ.8.40 కోట్ల ఆదాయం

- కార్తీకమాసంలో వ్రతాల సంఖ్య 1,34,476
- స్వామివారిని దర్శించిన 13 లక్షల మంది భక్తులు
- వెల్లడించిన అధికారులు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస వ్రతాల సంఖ్య లెక్క తేలింది. గురువారంతో కార్తీకమాసం ముగియడంతో వివరాలను అధికారులు వెల్లడించారు. వ్రతాల ద్వారా రూ.8.40 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది వ్రతాల సంఖ్య తగ్గిన విషయం విదితమే. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతాలు జరగగా ఈఏడాది 11256 లోటుతో 1,34,476తో ముగిసింది. అన్నవరం దేవస్థానంలో రూ.300, 1000, 1500, 2000 ధరల్లో వ్రతం టిక్కెట్లు అందుబాటులో ఉండగా వీటిలో ఆన్‌లైన్ టిక్కెట్లతో కలిపి సామాన్యులు ఆచరించుకున్న రూ.300 ధర వ్రతాలు 96484 జరిగాయి. రూ.100 ధర వ్రతాలు 16099, రూ.1500 ధర వ్రతాలు 9511, రూ.2000 ధర వ్రతాలు 12382 జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది కార్తీక మాసంలో కేవలం వ్రతాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.8,40,74,700 ఆదాయం లభించింది. మిగిలిన విభాగాల నుంచి మరో రూ.11.50 కోట్లు కలిపితే కార్తీకమాస ఆదాయం సుమారు రూ.20 కోట్లు రావొచ్చని అంచనా వేస్తున్నారు. రెండోపర్యాయం హుండీల లెక్కింపు పూర్తయిన తరువాత అధికారికంగా కార్తీకమాస ఆదాయం వెల్లడిస్తామని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. గతేడాది కంటే వ్రతాల సంఖ్యతో పాటుగా ఆదాయం కూడా సుమారు రూ.50 లక్షలనుంచి రూ.కోటి వరకు తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు. కార్తీకమాసం అంతా కలిపి సుమారు 13 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో దేవస్థానం సిబ్బంది సమష్టి కృషితో భక్తులకు ఎక్కడా అసౌకర్యం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్ పర్వదినాల్లో పశ్చిమరాజగోపురం వద్దనే ఉండి దళారుల ప్రవేశాన్ని నిరోధించి కేవలం వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే లిఫ్ట్‌సౌకర్యం పూర్తిస్థాయిలో అందించగలగడంతో పలువురి ప్రశంసలు పొందారు. కార్తీక పౌర్ణమి, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, జ్వాలాతోరణం, పంపా హారతులు వంటి ముఖ్యమైన కార్యక్రమాలను నిర్దేశించిన సమయానికి నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. పోలీసులు కూడా ఎంతో కష్టించి భక్తులకు సేవలందించారు.

భగవద్గీత సారాంశం సకల మానవాళికీ దిక్సూచి

అన్నవరం దేవస్థానంలో 12 రోజులపాటు గీతాజయంతి వేడుకలు : ఈవో సుబ్బారావు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో శ్రీకృష్ణుడు, అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత సారాంశం సకల మానవాళికీ దిక్సూచీ అని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం దేవస్థానంలో శ్రీ మద్భగవద్గీత జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిసెంబరు 1 వరకు రోజుకొక పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పారాయణ,ధ్యానం, సజ్జనసాంగత్యం నిర్వహిస్తామని.. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు. గీతాజయంతి రోజున అన్నమయ్య 12వ తరం వారసులు తిరుమల శ్రీవారి ఆలయ సంకీర్తన కైంకర్యవర్యులు తాళ్లపాక స్వామీజీ విచ్చేస్తారని చెప్పారు. ఈ వేడుకలను గత 12ఏళ్లగా ఏడాదికి ఒకరోజు పెంచుకుంటూ ప్రతీ ఆలయంలో నిర్వహిస్తున్నట్లు గీతాజయంతి ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. గీతాసారాంశాన్ని చిన్నారుల్లోకి తీసుకెళ్లి సమాజానికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.



భగవద్గీతపై ప్రసంగిస్తున్న ఈవో సుబ్బారావు, హాజరైన విద్యార్థులు



వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకి వనదుర్గ ఆలయంలో గురువారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. ఈ సందర్భంగా జపములు, పారాయణలు, హోమములు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండం లో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గా వించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పులుల గణనపై శిక్షణ

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పులుల గణనపై శిక్షణా కార్యక్రమం గురువారం చింతూరు అటవీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. శిక్షణ ఇచ్చేందుకు డెహ్రాడూన్ నుంచి వరల్డ్ వైల్డ్ ఫండ్ ఫర్ నేచర్ రీసెర్చ్ బయాలజిస్ట్ సాయికృష్ణ బృందం వచ్చింది. ఈ మేరకు జంతు జాడను కనుగొనే మెళకవలను వివరించారు. చింతూరు డీఎఫ్‌వో రవీంద్రనాద్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే జనవరి నుంచి ఫిబ్రవరి వరకు క్షేత్ర స్థాయిలో 3సార్లు జంతు గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. సబ్ డీఎఫ్‌వోలు రాఘవరావు, శివకుమార్, రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతూరు డీఎఫ్‌వో రవీంద్రనాథ్ రెడ్డి, పాల్గొన్న చింతూరు డివిజనల్ స్థాయి సిబ్బంది



పెళ్లి పనులకు ఊరెళ్తే ఇల్లు గుల్ల



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

- పెద్దాపురంలో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్
- నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూతురికి పెళ్లి కుదరడంతో పనుల నిమిత్తం ఊరు వెళ్తే ఇంట్లోకి దొంగ చొరబడి నగదు, బంగారం దోచుకెళ్లాడు. ఈనెల 10న కాకినాడ జిల్లా పెద్దాపురం టెలికం కాలనీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు విలేకర్లకు వెల్లడించారు. నిందితుడిని పట్టుకున్నట్టు చెప్పారు. వివరాల ప్రకారం.. పెద్దాపురం టెలికం కాలనీకి చెందిన పెంకే సింహాచలం ఆర్బీ పట్నం ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమార్తెకు వివాహం కుదరడంతో రూ.5 లక్షల నగదు, అరకాసు బంగారం బెడ్‌రూమ్ బీరువా లాకర్‌లో భద్రపరిచాడు. పెళ్లి పనుల నిమిత్తం కుటుంబ సభ్యులంతా కాకినాడ వెళ్లారు. దీంతో అనూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి చరణ్ విఘ్నేష్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి లాకర్‌ను తెరిచి రూ.5 లక్షల నగదు, అరకాసు బంగారు వస్తువును దోచుకెళ్లాడు. రాత్రి 12 దాటిన తర్వాత ఇంటికి చేరుకున్న యజమాని ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. బెడ్‌రూమ్‌లోని బీరువాలో నగదు, బంగారు వస్తువు మాయం కావడం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ వి.మౌనిక కేసు నమోదు చేయడంతో సీఐ విజయశంకర్ దర్యాప్తు చేశారు. బుధవారం రాత్రి పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిలో అయోధ్యాలయం గ్రాండ్ లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని సీఐ విజయశంకర్ అరెస్టు చేశారు. నిందితుడి దగ్గర నుంచి బంగారం, రూ.3.60 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, హోండా యాక్టీవా మోటారు సైకిల్, దొంగతనానికి ఉపయోగించే ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడిపై గతంలో చైతన్యపురం, మలక్‌పేట, అంబర్ పేట, సరూర్ నగర్, రాజమండ్రి వనస్థలిపురం, గండేపల్లి, ప్రకాష్‌నగర్, సర్పవరం, హయాత్ నగరం పోలీస్ స్టేషన్‌లలో పలు దొంగతనం కేసులు నమోదైనట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఫేక్ కాల్‌తో సైబర్ మోసం

- పోలీసులమంటూ ఓ వ్యక్తికి సైబర్ నేరస్తుల ఫోన్
- దొంగ బంగారం కొన్నారని కేసు పెడతామని బెదిరింపులు
- భయపడి రూ.30వేలు ఫోన్‌పే చేసిన బలభద్రపురం వాసి

బిక్కవోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బలభద్రపురానికి చెందిన అమలాపురపు శ్రీనివాస్ ఫేక్ ఫోన్ కాల్‌తో సైబర్‌నేరస్తుల బారిన పడి రూ.30 వేలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాలప్రకారం.. గురువారం ఉదయం పది గంటలకు 9493191296 నెంబరు నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి మేం కుప్పం పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నాం. మీరు దొంగ బంగారం కొనుగోలు చేశారని, వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలని లేకపోతే కేసు ఫైల్ చేస్తామని హెచ్చరించాడు. ఇలా పలుమార్లు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు రావాలని లేకపోతే రూ.50వేలు ఫోన్ పే చేయాలని ఒత్తిడి చేశాడు. దీంతో శ్రీనివాస్ సాయంత్రం రూ.30వేలు ఫోన్ పేచేశాడు. ఇది నకిలీకాల్ అని అతడి కుమారుడు గుర్తించాడు. తర్వాత పోలీసులను సంప్రదించారు. ఇది సైబర్ మోసమని తెలపడంతో శ్రీనివాస్ సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశాడు. ఆ తరువాత 1930 నెంబర్ నుంచి కాల్ వచ్చి బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టుఇవ్వాలని సూచించడంతో వారు తమకు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ వివరించారు.

వరికోత యంత్ర పరికరాలు, 120 లీటర్ల డీజిల్ చోరీ

బిక్కవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రానికి సంబంధించిన మోటార్, డోర్లు చోరీకి గురయ్యాయని యంత్రం యజమాని వి.పవన్ గురువారం బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం సారభావరం గ్రామానికి చెందిన వి.పవన్‌కు హార్వెస్టర్ వరికోత యంత్రం ఉంది. యంత్రంతో వరికోత పనులకు వెళ్తుంటాడు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం గ్రామంలోని చొల్లంగి పడ్డయ్య పొలంలోని వరిని బుధవారం కొంతమేర కోతకోసి మిగిలిన వరిని మరునాడు కోద్దామని యంత్రాన్ని పొలంలోను ఉంచేశాడు. గురువారం ఉదయం వెళ్లేసరికి హార్వెస్టర్ యంత్రానికి సంబంధించిన రెండు సైడు డోర్లు, ఆగర్ మోటార్, త్రిషర్‌డోర్, 120 లీటర్ల డీజిల్ ఆయిల్ చోరీ అయినట్టు పవన్ గుర్తించాడు. వాటి విలువ రూ.60వేలు ఉంటుందని తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఆయిల్ ట్యాంకర్ సీజ్

ముగ్గురిపై కేసు

ఐ.పోలవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి ఎనిమిది వేల లీటర్ల డీజిల్ ఆయిల్‌తో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు వెళ్తున్న ఒక ట్యాంకర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎదుర్లంక వద్ద ఐ.పోలవరం పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన ఆయిల్ ట్యాంకర్

హుండీ లెక్కింపులో సేవకుడిగా వచ్చి.. రూ.60వేలు దోచేసి...

నిందితుడి అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధింపు

ఆత్రేయపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో నగదును తస్కరించిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. వివరాల ప్రకారం.. రామచంద్రాపురం మండలం వేగయమ్మపేటకు చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు బుధవారం వెంకన్న ఆలయంలో హుండీ లెక్కింపులో సేవకుడిగా పాల్గొన్నాడు. సిబ్బంది కళ్లుకప్పి రూ.60వేలు నగదు దొంగిలించగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాలి

వైద్యాధికారికి డిప్యూటీ డీఎంహెచ్‌వో నోటీసు

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాలని వైద్యుడికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.పుల్లయ్య గురువారం నోటీసు ఇచ్చారు. అల్లూరి జిల్లా కూనవరం మండలం కూటూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డా.శ్రీనివాసమూర్తి కొద్దికాలంగా తులసిపాకల ఆరోగ్యకేంద్ర పరిధిలోని చింతూరు ఆరోగ్య ఉపకేంద్రంలో నివాసముంటున్నారు. దీంతో ఉప కేంద్రంలో నిర్వహించాల్సిన ఏఎన్‌సీ క్లినిక్, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రివ్యూ సమావేశాలతో సహా తదితర కార్యక్రమాలను నిర్వహణకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో విధిగా ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాల్సిందిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆదేశించారు. అందుకు కేవలం 3 రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. లేకపోతే స్థానిక సర్పంచ్, గ్రామ పంచాయితీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి, ఎస్‌ఐ సమక్షంలో పంచనామా నిర్వహించి ఆరోగ్య ఉపకేంద్రం స్వాధీన పర్చుకోవాల్సి వస్తుందని నోటీసులో హెచ్చరించారు.

సామర్లకోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గాంధీనగర్ నూకాలమ్మ గుడి ప్రాంతంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం కారణంగా గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌కు గురై పెద్దఎత్తున మంటలు చుట్టిముట్టాయి. దీంతో ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలుముకుంది. తరచూ ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపాలకు గురవుతుందని స్థానికులు చేసిన ఫిర్యాదుల మేరకు బుధవారమే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి గురువారం విద్యుత్ సరఫరా తిరిగి పునరుద్ధరించిన గంట సమయానికే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి మొత్తం బుగ్గి అయ్యింది. స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకునివిద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కాకినాడ జిల్లాలో సారాపై ఉక్కుపాదం

1,306 కేసుల నమోదు... 965 మంది అరెస్ట్

136 గ్రామాలు సారా రహితంగా ప్రకటన

ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి

కాకినాడ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు సారాపై ఉక్కుపాదం మోపినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సారా నిర్మూలన లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని కలెక్టర్ షాన్ మోహన్ ఈ ఏడాది మార్చి 7న ప్రారంభించారన్నారు. అప్పటి నుంచీ జిల్లావ్యాప్తంగా ఉన్న 7ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 21 మండలాల్లో గల 136 గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది నిర్విరామ కృషితో సారాపై ఉక్కుపాదం మోపారన్నారు. మార్చి నుంచి ఈనెల 10వరకు 1,306 కేసులు నమోదు చేసి 965మందిని అరెస్టు చేసి 18,490 కిలోల నల్ల బెల్లం, 9,220 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సారా తయారీకి వినియోగించే 5,49,650 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 53 వాహనాలను సీజ్ చేశామన్నారు. 1,375 మందిని బైండోవర్ చేసి వారిలో నలుగురిపై పీడీ యాక్ట్ తెరిచామని చెప్పారు. బ్రీచ్ అయిన వారి నుంచి రూ.14,48,500 వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల సహకారంతో నవోదయం 2.0ను విజయవంతం చేయగలిగామన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం 136 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం ఆనందదాయకమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి చెప్పారు.

అధిక దిగుబడినిచ్చే వరి రకాలు సాగుచేయాలి



నూతన రకం వరి విత్తనాల చిరు సంచులను రైతులకు అందజేస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

ఏరువాక శాస్త్రవేత్తలు

దివాన్‌చెరువు/కోరుకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడినిచ్చే నూతన వరి సన్న రకాలను సాగు చేయాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకటనరసింహారావు, మానుకొండ శ్రీనివాస్ తెలిపారు.గురువారం రాజానగరం మండలం నరేంద్రపురం, కోరుకొండ మండలం కోటికేశవరం, శ్రీరంగపట్నం గ్రామాల్లో అభ్యుదయ రైతులకు వరిరకాలు ఎంటీయూ-1426. ఎన్ఎల్ఆర్-3648 చిరు సంచులను గురువారం పంపిణీ చేశారు. ఆ రకం గుణ గణాలను వివరించారు. మార్టేరు పరిశోధన స్థానం నుంచి అభివృద్ధి పరచబడిన నూతన వరి సంచుల రకం ఎంటీయూ-1426, నెల్లూరు పరిశోధన స్థానం నుంచి నూతన రకం ఎన్ఎల్ఆర్-3648 చిరు సంచుల విత్తనాలను ఈ దాళ్వాలో రైతుల కమతాల్లో ప్రయోగం నిమిత్తం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ వరి రకాలు దాళ్వాలో 120 నుంచి 125 రోజుల్లో పక్వానికి వచ్చి హెక్టారుకు 6.5 నుంచి 7 టన్నులు దిగుబడి ఇస్తాయని తెలిపారు. అగ్గితెగులు, ఎండాకు తెగులు, దోమపోటు, ఉల్లికోడును తట్టుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

లేడీ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

బీఎస్పీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, భోజనం నాణ్యతగా పెట్టాలని అడిగినందుకు హాస్టల్ విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న రాజమహేంద్రవరంలోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1 లేడీ వార్డెన్‌పై కలెక్టర్ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అర్బన్ ఇన్‌చార్జి ఇసుపట్ల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, కో ఆర్డినేటర్ నక్కా వెంకటరత్నం రాజు మాట్లాడుతూ మెనూ అమలు చేయమన్నందుకు దళిత విద్యార్థులపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని, వారిని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పడం ఎంతవరకూ న్యాయమని అన్నారు. హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని, తమకు రక్షణ కరవైందని విద్యార్థులు కలెక్టర్‌ను కలసి వేడుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని, దీనిపై విచారణ త్వరగా పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లేడీవార్డెన్ రెచ్చిపోవడానికి ఏఎస్‌డబ్ల్యువో, డీఎస్‌డబ్ల్యువోలు కూడా ఒక కారణమని, సమస్య పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం చూపించిన ఇద్దరు అధికారులపైనా కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, విచారణ సందర్భంగా ఇతర వ్యక్తులు విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేయకుండా, బెదిరించకుండా ఉండేందుకు తమను కూడా విచారణలో భాగస్వాములను చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు కొల్లాటి అబ్బులు, కొండపల్లి సూరిబాబు, కోనాల లాజర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణల దిశగా పయనించాలి

రాజానగరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆవిష్కరణల దిశగా పయనించాలని కర్నూలు జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల ఇన్నోవేషన్ డైరెక్టర్ సి.రంజిత్‌కుమార్ ఆకాంక్షించారు.గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సైన్స్‌స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో బిజ్‌మైండ్ అవేకెనింగ్ ప్రోగ్రాం అనే వెబినార్‌ను గురువారం నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన రంజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు స్టార్టప్ అవకాశాలు, ఆధునిక వ్యాపార నమూనాలు, ఇన్నోవేషన్స్‌పై విలువైన సూచనలు అందించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ కె.వల్లీమాధవి మాట్లాడుతూ యువతలో వ్యాపార దృక్పథం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఎంబీఏ, బీబీఏ విభాగాధిపతులు ఆర్.రాజా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

24న కలెక్టరేట్ వద్ద ధర్నా



ఎంఈవోలకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు

పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ సంఘం రంగంపేట అధ్యక్షురాలు లక్ష్మి

రంగంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేయబోయే ధర్నాను విజయవంతం చేయాలని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మి, పీవీవీ సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. గురువారం రంగంపేటలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ పిలుపు మేరకు ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అప్పటి వరకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి-సమాన వేతనం అమలు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ ఇవ్వాలని, విద్యాశాఖలో విలీనం చేయాలని ఉద్యోగులందరికీ ప్రస్తుత ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, గతంలో జరిగిన సమ్మె ఒప్పందాలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లోనూ, డిసెంబరు 10 నిర్వహించబోయే రాష్ట్రస్థాయి ధర్నాలో ఎస్ఎస్ఏ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావులకు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం బ్యాంకర్లు, మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో బ్యాంకర్లు కీలకమని, వాటి లక్ష్యసాధనకు సహకారం అందించాలని అన్నారు. ముఖ్యంగా పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారస్తులకు రుణాలు అందించేందుకు శ్రద్ధ చూపాలన్నారు. నగర పరిధిలో 2,058 పీఎం స్వనిధి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వారంలోగా పరిష్కరించి రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు సూచించారు. నగరపాలక సంస్థ టిడ్కో గృహాలు కేటాయించిన లబ్ధిదారుల పట్ల ప్రత్యేక చొరవ చూపి రుణాల మంజూరు వేగవంతం చేయాలని కోరారు. కొంత మంది లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన రుణాల మంజూరును పునఃపరిశీలించాలన్నారు. మహిళల అభివృద్ధికి అవసరమైన యూనిట్ల స్థాపనకు బ్యాంకుల నుంచి అందిస్తున్న రుణాలపై ప్రజలకు బ్యాంకర్లు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజరు డీవీ ప్రసాద్, మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకరాజు, సీఎంఎం రామలక్ష్మి, అన్ని బ్యాంకుల మేనేజర్లు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.2.50 లక్షల విరాళం



సాయిబాబా ఆలయంలో అన్నసమారాధనలో పాల్గొన్న కంబాల

కోరుకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో సాయిబాబా ఆలయం వద్ద గురువారం నిర్వహించిన కార్తీక అన్న సమారాధనకు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు విచ్చేశారు.ఆలయంలో సాయి బాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిబాబా ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మూడు గురు వారాల పాటు తన సొంత ఖర్చులతో అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. అందుకుగాను రూ.2.50 లక్షల ను విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో రామసేన సభ్యులు, కూటమి నాయకులు దాసరి ధర్మరాజు, పెద్దాడ వెంకన్నదొర, కటకం చలం, దేశాల నరేష్, నాగ రమేష్, వీరాంజలి, కర్రి సూర్యమణికంఠ, మాదే హనుమంత్, డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సుందరేశ్వరుడికి పూజలు

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి రోజు కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి చేరుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయార్చకులు శివునికి మహాన్యాసపూర్వక అభిషేకాలు చేశారు. అమావాస్య తిథిని పురస్కరించుకుని మహిళలు, భక్తులు బ్రాహ్మణులకు స్వయంపాకం, సాలిగ్రామ, దీప దానాలు చేశారు. ఆలయంలో సాయంత్రం వేద పారాయణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఐపీపీబీ ఈ-నాక్ ప్రారంభం

రాజమహేంద్రవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారులకు ఈ-నాక్ మాండేట్ రిజిస్ట్రేషన్ సర్వీస్‌ని అందుబాటులోకి తీసుకొచ్చిందని రాజమండ్రి తపాలా డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు తెలిపారు. ఈ మేరకు గురువారం పోస్టర్‌ని ఆవిష్కరించారు.ఏదైనా లోన్, ఈఎంఐలను చెల్లించడానికి ఇది ఉపకరిస్తుందన్నారు.

జ్ఞాన భాండాగారాలు

- జిల్లా ఆడిట్ అధికారి సత్యనారాయణ
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
- వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు



సీతంపేట గ్రంథాలయంలో బెస్ట్ రీడర్ అవార్డు పొందిన సుజనకు సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన భాండాగాలు వంటివని జిల్లా ఆడిట్ ఆఫీసర్, కళాశాల పూర్వ విద్యార్థి ఏవీవీ సత్యనారాయణ అన్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. వాటిలో విజేతలైన వారికి ముగింపు కార్యక్రమాల్లో బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అధ్యక్షత వహించి మాట్లాడుతూ పుస్తకాలు మన సంస్కృతికి, సమాజ అభివృద్ధికి అద్దంలాంటివి అన్నారు. డీవీ రమణ మూర్తి, లైబ్రేరియన్ దుర్గ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ వై.స్వర్ణశ్రీ, పీవీబీ సంజీవరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రకళ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.రాఘవకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్థానిక గౌతమీ గ్రంథాలయ అధికారి ఘంటా శ్రీదేవి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ ప్రజెంటేషన్,క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.శ్రీదేవిని సత్కరించారు. స్థానిక సీతంపేట గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ వార్డు ఇన్‌చార్జి బుడ్డిగ రవి, బుడ్డిగ గోపాలకృష్ణమూర్తి, నిమిష కవి వెంకటేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ సోమరాజు విచ్చేశారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గౌతమీ గ్రంథాలయంలో నాట్య విశారద కొప్పినీడి స్వప్న శిష్య బృందం నృత్యప్రదర్శన చేసింది. కార్యక్రమానికి రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమలకుమార్, అరిపిరాల నారాయణరావు, పీవీఎస్ కృష్ణారావు, పెరుమాళ్ల రఘునాథ్, రాష్ట్ర నాటక అకాడమీ సభ్యుడు జీవీ రమణ, మారిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మాట్లాడారు.గౌతమీ గ్రంథాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య స్వగ్రామం కొంకుదురు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ముగిసాయి.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సొసైటీ చైర్‌పర్సన్ చింతా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ పీవీ, సత్తి నాగిరెడ్డి, గ్రంథాలయ అధికారి ఎస్.బాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చినకొండేపూడి, రఘుదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ క్విజ్, చిత్రలేఖనం, స్థానిక మహిళలకు లెమన్ స్పూన్, కుర్చీల ఆటలు పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ హెచ్ఎం బి.భాస్కరరావు, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యువో సురేష్‌బాబు, రఘుదేవపురం హైస్కూల్ ఉపాధ్యాయులు ఎస్.రామకృష్ణ, జి.శేఖర్ విచ్చేసి విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు, స్థానిక మహిళలకు గిఫ్టులు అందజేశారు.



కొంకుదురులో బహుమతులు పొందిన విద్యార్థులు

తొర్రేడు సొసైటీ సేవలు అభినందనీయం



తొర్రేడులో సహకార జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తొర్రేడు సొసైటీ ద్వారా రైతులకు సేవలందించడమే కాకుండా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలోని తొర్రేడు సొసైటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గోరంట్ల సహకార పతాకావిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను, సిబ్బందిని అభినందించారు.జిల్లా సహకార అధికారి ముళ్ళపూడి వెంకటరమణ మాట్లాడుతూ సహకారం సంఘం ద్వారా రైతులకే కాకుండా వివిధ చేతివృత్తులు చేసుకొనే వారికి జాయింట్ లయబిలిటీ గ్రూపుల ద్వారా 200 మంది సభ్యులకు రూ.57.99 లక్షల రుణాలు అందించారన్నారు. కార్యక్రమంలో భాగంగా భాస్కర ఆగ్రో కెమికల్స్ సహకారంతో గోరంట్ల చేతులమీదుగా వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.మూనార్ ఆగ్రో కెమికల్స్ సౌజన్యంతో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దండమూడి బాపినీయుడు, సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, ఆదిమూలపు వెంకటేశ్వరరావు, ఆప్కాబ్ డీపీడీఎం టి.మౌనిక, వెటర్నరీ ఏడీఏ డాక్టర్ జి.రవివర్మ, డాక్టర్ ప్రసన్నకుమార్, మునార్ సంస్థ జోనల్ మేనేజరు గోవిందరావు, భాస్కర్ కెమికల్స్ ప్రతినిధి వేణుగోపాలరావు,తొర్రేడు డీసీసీబీ సూపర్‌వైజర్ ఎస్.లోకేష్, సొసైటీ సీఈవో కేవీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి రూపురేఖలు మారుస్తాం

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ముగిసిన సహకార వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాబోయే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం సిటీ, రూరల్ రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. వీటిలో భాగంగా నూతనంగా 5 ఎంఎల్‌డీ ప్లాంట్లు నిర్మించాలని,మెయిన్ రైల్వేస్టేషన్ రోడ్డు, ఈస్ట్ రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ చేయాలని, ప్రధాన డ్రైనేజీ నిర్మించాలని చెప్పారు. హుకుంపేట మెయిన్ డ్రైనేజీ చివరి వరకు నిర్మించాలని, క్వారీ సెంటర్ నుంచి మల్లయ్యపేట వరకు రోడ్డును విస్తరించాలని, ఎస్వీజీ మార్కెట్ నుంచి వందడుగుల రోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేసి డ్రైనేజీ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని,వార్డులన్నింటిని జీరో వర్క్ వార్డులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శేషగిరిరావు, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, ఈఈలు మాధవీ, ఆలీ, డీఈలు సత్యనారాయణ, లోవరాజు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న చెకుముకి జిల్లాస్థాయి సంబరాలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెకుముకి జిల్లా స్థాయి సంబరాలు ఈనెల 23వ తేదీన రాజమహేంద్రవరం సీతంపేటలోని ప్రగతి జూనియర్ కళాశాల వద్ద జరుగుతాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల్లో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థుల టీంలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన టీంలు డిసెంబరు 12, 13, 14 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

గుండెనొప్పితో రైల్లోనే వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలికి గుండె నొప్పి రావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రాజమహేంద్రవరానికి చెందిన వనమా లక్ష్మి(67) గురువారం రాత్రి తన బంధువులతో కలిసి విజయవాడలోని చిన్న కుమార్తె గృహ ప్రవేశానికి బయల్దేరారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి వెళ్తుండగా కొవ్వూరు సమీపంలో ఆమెకు గుండె నొప్పి వచ్చింది. మార్గమధ్యలో రైలు ఎక్కడా ఆగకపోవడంతో చివరకు ఏలూరులో ఆమెను కిందకు దించారు. రైల్వే వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడిపై పోక్సో కేసు

సీతానగరం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించాలంటూ బాలికలను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. సీతానగరం గ్రామానికి చెందిన పుట్ట వెంకట తేజ ఎనిమిదో తరగతి చదువుతున్న పద్నాలుగేళ్ల బాలికకు ఫోన్ చేసి తనను ప్రేమించాలని వేధిస్తున్నాడు.దాంతో విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ క్రమంలో ప్రవర్తన మార్చుకోమని పలుమార్లు తేజను బాలిక తల్లిదండ్రులు హెచ్చరించారు. అయినా తేజ ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
- కుతుకులూరులో సీసీ రోడ్లు ప్రారంభం



కుతుకులూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుతుకులూరు గ్రామంలో నిర్మించిన ఎనిమిది సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి, వైఎస్ ఎంపీపీ పులగం బులిరెడ్డి, డీసీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, కర్రి చిన్నారెడ్డి, పులగం తిరుమలరెడ్డి, ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అశ్రద్ధ చూపవద్దని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు,ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల నాలుగు మండలాల్లో 'క్యాడర్ కోసం నల్లమిల్లి' కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా గ్రామాల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రజలు, క్యాడర్ నుంచి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వద్దు

బిక్కవోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించారు.గురువారం ఆయన ఈ నెల 26న బిక్కవోలులో నిర్వహించే షష్ఠి ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. ప్రాచీన ఆలయం కావడం, ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగినట్టు ఏర్పాట్లు చేయాలని, మహిళా పోలీసు సిబ్బందితో పాటు నియోజవర్గంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులను వినియోగించుకోవాలన్నారు. మహిళా శక్తి సభ్యులను నియమించుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న వీరభద్రుడి సంబరంతో ఉత్సవాలు ప్రారంభిస్తామని 26న షష్ఠి, డిసెంబరు 2న అన్నదానంతో ఉత్సవాలు ముగిస్తామన్నారు.. షష్ఠి రోజునే కాకుండా మిగిలిన ఐదు రోజుల్లో స్వామిని దర్శించుకునేలా భక్తులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, బేరా శ్రీను, సింగారపు రామారావు, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ రవిచంద్రకుమార్, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

సోలార్ విద్యుత్‌పై ప్రజల్లో అవగాహన కలిగించాలి.. ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో అధికారులు, సిబ్బంది చురుగ్గా పనిచేశారని, అలాగే మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అధికారులు సహకరించాలని సూచించారు. నియోజకవర్గంలో 144 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాగా పనులు వేగంగా చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ముక్కినాడ 33/11కేవీ సబ్ స్టేషన్‌కు భూమి కేటాయింపు వేగవంతం చేస్తామన్నారు. కలవచర్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో 33/11కేవీ సబ్ స్టేషన్ మంజూరుకు భూమి బదలాయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజానగరం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 33 కేవీ సబ్‌స్టేషన్ పనుల వివరాలు తెలుసుకున్నారు. కోటికేశవరంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కొత్తగా ప్రతిపాదించే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్ల వివరాలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా సోలార్ విద్యుత్ వినియోగించాలని విస్తృత ప్రచారం చేస్తున్నాయన్నారు. సోలార్ విద్యుత్ వినియోగానికి ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా వినియోగదారులు ఆదాయం పొందవచ్చని ప్రజలకు వివరించాలన్నారు. బ్యాంకు రుణాల ద్వారా కిలో వాట్ సోలార్ ప్యానళ్లపై రూ.30 వేలు, రెండు కిలో వాట్ ప్యానళ్లపై రూ.60 వేలు, మూడు కిలో వాట్ ప్యానళ్లపై రూ.70 వేల సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

తాళ్లపూడి, నవంబరు 20 (ఆంధ్ర్యజ్యోతి): తాళ్లపూడిలోని శ్రీపైడి ఐటీఐ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ట్రంప్ జూనియర్‌ను కలిసిన ఎంఆర్ పాలెం యువకుడు



ట్రంప్ జూనియర్‌కు స్వాగతం పలుకుతున్న మణీంద్ర

కడియం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి తొలిసారిగా విచ్చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు ట్రంప్ జూనియర్‌కు మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి కుమారుడు, ఇంటర్నేషనల్ చార్టెడ్ ఫైట్ అసోసియేషన్ సీఈవో అన్నందేవుల మణీంద్ర గురువారం ఢిల్లీ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ట్రంప్ జూనియర్ మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటిస్తారు. తాజ్‌మహల్ వంటి పర్యాటక ప్రాంతాలు చూసి రాజస్థాన్‌లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ మూడు రోజుల పాటు ట్రంప్ జూనియర్‌తో పాటు మణీంద్ర ఉంటారని తండ్రి చంటి తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ప్రేమంటే
సూర్యమినీ	: మఫ్టీ పోలీస్, పాంచ్ మినార్
సూర్యప్యాలస్	: శిశు
స్వామి	: 12 ఎ రైల్వే కాలనీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: 12 ఎ రైల్వే కాలనీ
శివజ్యోతి	: మఫ్టీ పోలీస్
రాజా	: జటాధర
ఊర్వశి	: కొదమ సింహం
మేనక	: శిశు
రంభ	: రాజు వెడ్స్ రాంబాబు
అప్సర	: ది గర్ల్ ఫ్రెండ్
అశోక	: కాంత
వీఎస్ మహల్(నామవరం)	: శిశు
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: 12 ఎ రైల్వే కాలనీ
వెంకటసూర్య(కడియం)	: 12 ఎ రైల్వే కాలనీ
సత్యగౌరి (అనపర్తి)	: ది గర్ల్ ఫ్రెండ్
సూర్యశ్రీ (అనపర్తి)	: 12 ఎ రైల్వే కాలనీ
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: 12 ఎ రైల్వే కాలనీ
రామకృష్ణ(కోరుకొండ)	: 12 ఎ రైల్వే కాలనీ
గీతాసినిమాస్ (సీతానగరం)	: 12 ఎ రైల్వే కాలనీ
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: 12 ఎ రైల్వే కాలనీ
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్





ఎన్‌కౌంటర్‌లో స్వాధీనం చేసుకున్న తుపాకీని పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

సంభవ్.. కొనసాగింపు!

- 'ఆపరేషన్ సంభవ్' కొనసాగుతుందన్న డీజీపీ గుప్తా
- తూర్పు ఏజెన్సీలో వచ్చే ఏడాది మార్చి దాకా కూంబింగ్
- అడవుల్లో జల్లెడపడుతున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు
- పర్యాటకరంగంపై కొంత ప్రభావం

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి అంటే ఇప్పుడు చక్కటి పర్యాటక కేంద్రం. తెలుగురాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఇక్కడి అడవుల్లో పర్యటించేందుకు నిరంతరం వస్తుంటారు. వాగులువంకలు, దట్టమైన అడవులతో పచ్చని లోకాన్ని ఈ ప్రాంతం తలపిస్తుంది. అయితే రెండు దశాబ్దాల కిందట నక్సల్బరి ఉద్యమంలో కీలక నేతలకు ఈ ఏజెన్సీ ఒక షెల్టర్. తాము మారేడుమిల్లి అడవుల్లోనే ఆయుధ సామగ్రిని తయారుచేసే వారమని ఉద్యమం నుంచి బయటకు వచ్చిన టెక్ మధు ఇటీవల ఓ డిబేట్‌లో చెప్పారు. అంటే ఇది నక్సల్ ఉద్యమంలోనే కాకుండా ఆయుధ సంపత్తిని తయారుచేసే కేంద్రంగానూ ఉండేదని తెలుస్తోంది. సాంకేతికపరమైన శిక్షణ కోసం తూర్పు ఏజెన్సీ ముఖ్య కేంద్రంగానూ ఎంచుకున్నట్టు మాజీ నక్సలైట్లు అందించే సమాచారం తేటతెల్లం చేస్తోంది. ఏజెన్సీలో ఇరవైయేళ్ల కిందట ఐఏఎస్‌ల కిడ్నాప్ తర్వాత భారీగా కూంబింగ్ జరగడంతో ఏజెన్సీ నుంచి నక్సలైట్లు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. కానీ ఈ ఏడాదిలో మళ్లీ ఇప్పటివరకు జరిగిన నాలుగు ఎన్‌కౌంటర్లు నాటి రోజులను తలపిస్తున్నాయి. ఇక అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏడాది కాలంగా ముమ్మరంగా కూంబింగ్ జరుగుతోంది. తాజా ఘటనల నేపథ్యంలో చేపట్టిన కూంబింగ్ 'ఆపరేషన్ సంభవ్' మూడ్రోజుల తర్వాత ముగిసిందని ఎస్పీ అమిత్ బర్దర్ ప్రకటించారు. అయితే 'ఆపరేషన్ సంభవ్' 2026మార్చి వరకు కొనసాగుతుందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రకటించారు. గురువారం ఆయన రంపచోడవరంలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో వినియోగించిన ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంలోనే కేంద్రం నిర్దేశించిన లక్ష్యం మేరకు రాష్ట్రంలో మావోయిస్టుల అలజడి లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టంచేశారు. దీంతో రంపచోడవరం ఏజెన్సీలో ఇకపై ముమ్మరంగా కూంబింగ్ జరుగునుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు రంపచోడవరం ఏజెన్సీలో ప్రశాంతమైన వాతావరణం ఉండి పర్యాటకులకు విడిదిగా విలసిల్లుతుండగా.. కొద్ది నెలలపాటు భద్రతా దళాల బూట్ల చప్పుళ్లు, నిఘా వర్గాల కదలికలు, పోలీసు ఉన్నతాధికారుల పర్యటనలతో కొంత ఆందోళనకర పరిస్థితులు నెలకొనే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా ఏజెన్సీతోపాటు సమీపంలోని మైదాన ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్న మావోయిస్టుల గాలింపు చర్యలు సైతం ముమ్మరంగా సాగాలని డీజీపీ ఆదేశాలివ్వడంతో ఆమేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ విస్తృత తనిఖీలకు దిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకుల తాకిడిపై కొంత ప్రభావం చూపనుంది. కొంత కాలం ఈ ప్రభావం ఉండే అవకాశం ఉంది.

మన్యంలో పోలీస్ బాస్ పర్యటన

అల్లూరి మన్యం మారేడుమిల్లి అడవుల్లో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల ఫలితాలు, ఆపరేషన్ సంభవ్ పురోగతులను పరిశీలించేందుకు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం రంపచోడవరం వచ్చారు. ప్రత్యేక హెలీకాప్టర్ మీద ఆయన రంపచోడవరం డిగ్రీ కళాశాల మైదానంలో దిగి అక్కడి నుంచి రంపచోడవరం పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పాటుచేసిన ఎన్‌కౌంటర్లో స్వాధీనపర్చుకున్న ఆయుధాలు, పేలుడు సామగ్రి, ఇతర పరికరాల ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డాతోనూ, అల్లూరి జిల్లా ఎస్పీ బర్దర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. రెండు ఎన్‌కౌంటర్లు, మృతి చెందిన మావోయిస్టుల వివరాలపై ఆరా తీశారు. ఇంటిలిజెన్స్ చీఫ్ లడ్డా, అల్లూరి ఎస్పీ అమిత్‌బర్దర్ ఆయన వెంట ఉన్నారు.

నలుగురికి పోస్టుమార్టం

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్, దేవే, లక్మల్ అలియాస్ చైత్, మల్ల అలియాస్ మల్లాలలకు పోస్టుమార్టం నిర్వహించారు. మిగిలిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.



ఖరీఫ్ కోతలు ముమ్మరం

- మరోపక్క ధాన్యం కొనుగోలు వేగవంతం
- రబీకి సిద్ధమవుతున్న యంత్రాంగం
- 92,998 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులకు రూ.118.5 కోట్లు చెల్లింపు

రాజమహేంద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖరీఫ్ వరి కోతలు ముమ్మరం అయ్యాయి. మరోపక్క రబీ పంట సాగుకు కూడా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈనెలాఖరు నుంచి నారుమళ్లు ఊపందుకుంటాయి. డిసెంబర్ 20వ తేదీ నుంచి రబీనాట్లు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇటీవల రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, ప్రధాని కిసాన్ యోజన కింద ఒక్కో రైతు 7 వేల వంతున డబ్బు జమచేసిన సంగతి తెలిసిందే. మొత్తం జిల్లాలోని 1,14,991 మందికి రూ.77 కోట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమైంది. దీంతో రైతుల్లో కూడా ఉత్సాహం పెరిగింది. ప్రస్తుతం ఖరీఫ్ రైతాంగం ధాన్యం మాసూళ్లలో నిమగ్నమైంది. జిల్లాలో సుమారు 75 వేల హెక్టార్లలో ఖరీఫ్ వరిసాగు చేశారు. దాని ద్వారా సుమారు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా. అందులో ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. ఇప్పటికి జిల్లాలో 21,766 .59 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లోకి ఒక లక్షా 25వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం సిద్ధంగా ఉంది. డిసెంబరు మొదటివారంలో కోతలు పూర్తవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ప్రస్తుతం బిక్కవోలు మండలంలో 4092 హెక్టార్లు, ఉండ్రాజవరంలో 1800, పెరవలిలో 500, రాజమహేంద్రవరం రూరల్‌లో 281.59 హెక్టార్లు, కొవ్వూరులో 198, తాళ్లపూడిలో 305, రంగంపేటలో 800, నిడదవోలులో 2500, దేవరపల్లిలో 300, గోకవరంలో 500, చాగల్లులో 1200, గోపాలపురంలో 1000, అనపర్తిలో 3010, నల్లజర్లలో 1300, రాజానగరంలో 2800, కడియంలో 500, కోరుకొండలో 80, సీతానగరంలో 600 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి.

183 కొనుగోలు కేంద్రాల నుంచి..

జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం అయింది. జిల్లాలో మొత్తం నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకూ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 183 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 12,766 మంది రైతుల నుంచి 92,988.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. వీటికి సంబంధించి రైతు నుంచి కొనుగోలుచేసిన 48 గంటల్లోపే 6,750 మంది రైతులకు రూ.118.5 కోట్లు చెల్లించారు.



నాడు గాలికి.. నేడు దారికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచిరోజులు వచ్చాయి. అప్పట్లో వీటికి కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్లించి భవనాల నిర్మాణాన్ని గాలికి వదిలేయడంతో అవన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వం వీటికి శాశ్వత భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చింది. అసంపూర్తిగా వదిలేసిన వాటిని, అసలు భవనాలే లేని క్లినిక్‌లకు శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 39 క్లినిక్‌లకు శాశ్వత భవనాలకు రూ.11.50 కోట్ల నిధులు కేటాయించింది. మరో వారంలో కోనసీమలో 56 భవనాలకు రూ.23 కోట్లు కేటాయించబోతోంది. ఇక తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు రూ.12 కోట్లతో మరిన్ని భవనాల నిర్మాణం చేపట్టడానికి సన్నద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో వీటి నిర్మాణం ద్వారా పేదలకు ఇంటికి సమీపంలోనే వైద్య సేవలు అందేలా చేయడానికి కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది. మరోవైపు విలేజ్ క్లినిక్‌ల ద్వారా సమర్థవంతంగా వైద్య సేవలు అందించేలా రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది.

- ఉమ్మడి జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచి రోజులు
- వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- కాకినాడ, కోనసీమల్లో 39 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.11.50 కోట్లతో టెండర్లు
- మరో వారంలో కోనసీమలో రూ.23 కోట్లతో 56 క్లినిక్‌లకు టెండర్లు జారీ
- తూర్పు, కాకినాడ జిల్లాల్లో మరో రూ.12 కోట్లతో భవనాల నిర్మాణానికీ సన్నద్ధం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభించింది. వీటిలో పేదలకు 14 రకాల వైద్య సేవలు అందుతాయని ప్రకటించింది. అందులోభాగంగా ఉమ్మడి జిల్లాలో 1,050కిపైగా వీటిని మంజూరు చేసింది. ఇందులో కాకినాడ జిల్లాలో 410, తూర్పుగోదావరి జిల్లాలో 368 వరకు ఉన్నాయి. అయితే వీటిలో సగం క్లినిక్‌లకు శాశ్వత భవనాలే లేవు. చాలావరకు సచివాలయాలు, పంచాయతీల్లో నిర్వహించి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. నిజానికి వీటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. చివరకు వీటిని కూడా అప్పటి జగన్ సర్కారు నిధులు దారి మళ్లించేసింది. దీంతో అనేక క్లినిక్‌లకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవు. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా క్లినిక్‌లకు అసలు ఇప్పటికీ సొంత భవనాలు లేక అద్దె, లేదా వేరే పంచన నడుస్తున్నాయి. దీంతో సేవలు కూడా గ్రామీణ ప్రజలకు సరిగ్గా అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్రంతో మాట్లాడి నిధులు రప్పించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కేంద్రం 80 శాతం వరకు నిధులు సమకూర్చుతోంది. వీటిని 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' పేరు నామకరణం చేసింది. ఇందులోభాగంగా అసంపూర్తిగా ఉన్నవి, అద్దె భవనాల్లో ఉన్న వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో తాజాగా 39 హెల్త్‌క్లినిక్‌లకు శాశ్వత భవనాలు మంజూరు చేస్తూ రూ.11.50 కోట్లు విడుదల చేసింది. తుని మండలం ఎస్.అన్నవరం4 క్లినిక్‌కు రూ.28.98 లక్షలు, ఎస్.అన్నవరం-1కు రూ.29.09 లక్షలు, పిఠాపురం మండలంలో నరసింగపురం క్లినిక్‌కు రూ.29.37లక్షలు, గొల్లప్రోలు మండలం మల్లవరం రూ.29.36 లక్షలు, తాటిపర్తి రూ.29.12, తాటిపర్తి-2 రూ.29.13 లక్షలు, పెదపూడి మండలం గండ్రేడు రూ.27.87, రాజుపాలెం రూ.27.75, ఏపీత్రయం రూ.29.69, దోమాడ రూ.27.06, కాజులూరు మండలం కోలంక-2 రూ.29.34 లక్షలు, ఉప్పుమిల్లి రూ.29.59, పల్లిపాలెం2 రూ.29.19, ప్రత్తిపాడు మండలం శంకర్లపూడి రూ.29.03 లక్షలు, ఏలేశ్వరం మండలం ఎర్రవరం-1 రూ.28.83, లంపకలోవ రూ.29.03, సామర్లకోట మండలం వేట్లపాలెం-1 రూ.29.05, మాధవపట్నం రూ.29.24, పెద్దాపురం మండలం కాండ్రకోట రూ.28.68లక్షలు, మర్లోవ రూ.28.85, కరప మండలం పెనుగుదురు రూ.29.51 లక్షలు, కరప రూ.29.36, రౌతులపూడి గుమ్మరేగుల రూ.29.31, కాకినాడ-1 రూ.29.58లక్షలు, రమణయ్యపేట రూ.29.57, వలసపాకల రూ.29.54, సూర్యారావు పేట రూ.29.41, కొవ్వూరు రూ.29.65, తూరంగి 29.58, తూరంగి-22 రూ.29.58, తూరంగి-4 రూ.29.58లక్షలు, యు.కొత్తపల్లి రూ.29.38, పొన్నాడ రూ.29.38 లక్షలు మంజూరు చేసింది. కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పోతవరం క్లినిక్‌కు రూ.29.21లక్షలు, రామచంద్రపురం మండలం ఉండూరుకు రూ.29.58, వెలంపాలెం రూ.29.63. కె.గంగవరం-2 రూ.29.22, కె.గంగవరం మండలం దంగేరు క్లినిక్‌కు రూ.29.24, ముమ్మిడివరం మండలం కొత్తలంకకు రూ.28.81లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ క్లినిక్‌లను ఏడాదిలోగా పూర్తి చేసేలా తాజాగా ప్రభుత్వం టెండర్లు జారీచేసింది. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో వీటి నిర్మాణం పూర్తికానుండగా, ఈనెల 26లోగా వీటికి టెండర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లను కోరింది.

త్వరలో మరిన్ని..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వెయ్యికిపైగా ఉన్న హెల్త్ క్లినిక్‌ల్లో 30శాతం పునాదులు, శ్లాబ్ సాయిలో మూడేళ్ల నుంచీ అప్పటి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయాయి. వీటిని కూడా ఇప్పుడు ప్రభుత్వం పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అటు శాశ్వత భవనాల నిర్మాణంపైనా దృష్టిసారించింది. మరో వారంలో కోనసీమ జిల్లాలో రూ.23 కోట్లతో 56 హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించేలా ప్రభుత్వం టెండర్లు పిలవబోతోంది. అలాగే తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో రూ.12 కోట్లతో మరికొన్ని భవనాల నిర్మాణం చేపట్టనుంది. సగంలో నిలిచిపోయిన క్లినిక్‌లు ఉమ్మడి జిల్లాలో 250కిపైగా పూర్తి చేయడానికి అనుమతులు జారీ చేయనుంది. చాలాభవనాలకు స్థలాలు కూడా లేకపోవడంతో వీటిని కూడా కొన్ని నెలల కిందట ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు. మరోపక్క ఈ క్లినిక్‌ల్లో ఉండాల్సిన సిబ్బంది కూడా గత ప్రభుత్వంలో చాలాచోట్ల లేరు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా ఏఎన్ఎం, ఆశావర్కర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి.. వీరంతా ఆయా గ్రామాల్లోని క్లినిక్‌ల్లో ఓపీ సేవలు అందించనున్నారు.



రాజమహేంద్రవరంలో రివర్ ఫ్రంట్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి, కమిషనర్ రాహుల్‌మీనా

వైసీపీ పాపాల పనులు శాపాలుగా మారాయి

- రాళ్లు పేర్చి ప్రమాదాలకు నెలవుగా జంక్షన్లను మార్చారు
- కూటమి హయాంలో టూరిస్ట్ హబ్‌గా రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కమిషనర్ మీనా

రాజమహేంద్రవరంసిటీ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాయకుల పాపాల పనులు ప్రజలకు శాపాలుగా మారాయని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శించారు. గురువారం రాజమహేంద్రవరం గోదావరి బండ్‌పై నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులను కమిషనర్ రాహుల్‌మీనాతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల వివరాలు ఆరా తీశారు. వేగంగా నాణ్యతతో ఈ పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం పుష్కరాలరేవు, దేవీచౌక్‌లలో గతంలో నిర్మించి రాళ్లు పేర్చు కూడళ్లను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడారు.. మాజీ ఎంపీ భరత్‌రామ్ సొంత అజెండాతో పనిచేసి దేవీచౌక్, పుష్కరఘాట్‌లలో రాళ్లు పేర్చారని, దీనివల్ల ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అలాగే తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ప్రజల కోరిక మేరకు హ్యేవీస్ట్రీట్ తొలగించామని, ఈ రాళ్ల విషయంలో విజిలెన్స్ విచారణ జరగిందని, త్వరలో వీటికి మోక్షం కలుగుతుందన్నారు. రాళ్లపేర్చి ప్రజాధనం దుర్వినియోగం చేశారని చెప్పారు. ఇక గోదావరి బండ్‌పై నిర్మిస్తున్న రివర్‌ఫ్రంట్ మంచి టూరిస్ట్ హబ్‌గా మారుతుందన్నారు. కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి గోదావరి రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామన్నారు. జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎంపీ భరత్‌రామ్ పబ్లిసిటీ పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం చేశాడన్నారు. అధికార మదంతో నగరాన్ని అస్తవ్యస్థంగా మార్చాడని, కూటమి ప్రభుత్వం వాటిని సరిచేసేందుకు కృషిచేస్తోందన్నారు. ఉమార్కండేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యిన్నమూరి దీపు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి



కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

- పబ్లిక్ స్థలాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు
- అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యంపై నివేదికలివ్వాలి
- జిల్లాలో వ్యవసాయ మార్కెట్ సెస్ వసూళ్లు వేగవంతం చేయాలి
- కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష

రాజమహేంద్రవరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ ప్రభుత్వశాఖ తమ పనితీరును మెరుగుపరచుకోవాలి. ఈ పనితీరును రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. శాఖల వారీగా గ్రేడింగ్ ఉంటుంది. ర్యాంకు పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం పలు ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ప్రాధాన్యతాంశాలపై సమీక్షించారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న అన్ని సేవల్లోనూ పారదర్శకత, వేగం, నాణ్యత పెరగాలన్నారు. గ్రామీణ నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో రూ.3 లక్షల వ్యయంతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు నిర్మించనున్నారని, స్వచ్ఛభారత్ మిషన్ గ్రాంటు ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్లేస్‌లలో ప్రజల సౌకర్యార్థం ఈ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నామని, ఒక్కో కాంప్లెక్స్‌లో 2 టాయిలెట్లు, 2 యురినల్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం కోఆర్డినేషన్ మీటింగ్ ఉంటుందని, దీన్ని ఐసీడీఎస్, మెడికల్ ఆఫీసర్లు కలసి నిర్వహించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, పిల్లందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ఎంత మంది శ్యాం, మ్యామ్ లోపాలుగల పిల్లలు ఉన్నారో గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లాలో డెలివరీలు అధికంగా జరిగే ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు, మాతృ మరణాలు చోటు చేసుకున్న ఆసుపత్రుల వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా సెస్ వసూలు లక్ష్యాలు పెంచాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.34.31 కోట్ల వార్షిక వసూళ్ల లక్ష్యంగా ఉండగా, అక్టోబరు నాటికి కేవలం రూ.13.13 కోట్లు మాత్రమే వసూలు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వసూళ్ల వేగవంతం చేయాలని గోపాపురం మార్కెట్ కమిటీలో ఈ-నామ్ పథకం అమలుచేయాలని ఆమె ఏడీని ఆదేశించారు. నిత్యావసర సరుకులు, వినియోగదారులు వినియోగించే ఉత్పత్తులు మార్కెట్లకు తీసుకుని రావడంలో సిబ్బంది చొరవచూపాలని చెప్పారు. రైతులకు తగిన ప్రోత్సాహం అందించాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీఆర్వో టి. సీతారామమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, కేఆర్ఆర్‌సీ, ఎస్డీసీ ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, పీపీవో ఎల్.అప్పలకొండ, జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కేఎన్ జ్యోతి, ఐసీడీఎస్ పీడీ టి.శ్రీదేవితోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆఫర్!

హైదరాబాద్ ఇంద్ర ఏసీ బస్సు టిక్కెట్‌పై 15 శాతం రాయితీ

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇంద్ర ఏసీ బస్సు టిక్కెట్‌లో 15 శాతం రాయితీ ఇచ్చారు. హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్సు టికెట్ చార్జీతో ఇంద్ర ఏసీ బస్సులో ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు. ఇంద్ర ఏసీ బస్సు సాధారణ టిక్కెట్ ధర రూ.1060 కాగా ప్రయాణ చార్జీలో 15 శాతం రాయితీతో టిక్కెట్ ధర రూ.920 మాత్రమే అని ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ రాయితీ డిసెంబరు 31వ తేదీ వరకూ అందుబాటులో ఉంటుందని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అక్రమంగా ఇసుక తరలింపు లారీకి రూ.లక్ష జరిమానా

కొవ్వూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీకి రూ.లక్ష జరిమానా విధించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కే.శ్రీహరిరావు తెలిపారు. గణపవరం మండలం పిప్పరకు చెందిన లారీడ్రైవర్ కొడమంచిలి రాజేంద్రబాబు ఏపీ39 యూఎల్0005 నెంబర్ గల లారీలో కొవ్వూరు మండలం వాడపల్లి నుంచి నిడదవోలు వైపునకు ఇసుక రవాణా చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం సీతంపేట వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా పట్టుబడ్డాడు. దీంతో లారీని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పగించారు. దీంతో రూ.లక్ష జరిమానా విధించారు.

డిసెంబరు మొదటివారంలో పోలవరం నిర్వాసితులతో షర్మిళారెడ్డి భేటీ

పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులతో వచ్చేనెల మొదటి వారంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి భేటీ కానున్నారని ప్రాజెక్టు నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు 89 వేల మందికి ప్రభుత్వ పరిహారం చెల్లించాలన్నారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లని, దీనివల్ల 89 వేలమంది నిర్వాసితులవుతారన్నారు. వీరందరికీ రూ.55 వేల కోట్లు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని వివరించారు. కానీ ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి 38 వేల మంది నిర్వాసితులకు రూ.38 వేల కోట్లు మాత్రమే నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయమని అన్నారు. కానీ రూ.25 వేల కోట్లు ఎగవేయడానికి కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ బాధితుల పక్షాన పోరాడుతుందని, అందులోభాగంగానే తమ నాయకురాలు షర్మిళారెడ్డి వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లు ఉంచకపోతే గ్రావిటీ ద్వారా రెండు కాలువల నుంచి వైజాగ్, కృష్ణా జిల్లాలకు సహజంగా నీరు వెళ్లకపోవడమే కాకుండా నీటి నిలువ సామర్థ్యం తగ్గించడం వల్ల జలవిద్యుత్ కేంద్రానికి సరిపడా నీళ్లు వెళ్లకుండా జలవిద్యుత్పత్తి జరగదన్నారు. అప్పుడు జలవిద్యుత్ కేంద్రం నిరుపయోగం అవుతుందన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నల్లజర్ల హైస్కూల్ విద్యార్థులు

నల్లజర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో విజయ నగరంలో ఈనెల 23,24,25 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నల్లజర్ల హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు అండర్ - 17 విభాగంలో అర్హత సాధించినట్టు ఆ పాఠశాల హెచ్ఎం కోమలి చిత్ర తెలిపారు. గురువారం అర్హత సాధించిన విద్యార్థినులైన బేతా ఉదయ పోశ్వరి, ఫైనం దుర్గాభవానీను హెచ్ఎం, స్కూల్ కమిటీ చైర్మన్ కోడూరు నారాయణ, పీడీ పల్లి వెంకట అప్పారావు, గ్రామపెద్దలు పల్లి సుబ్బారావు, ఉపాధ్యాయులు కే. రాంబాబు, వీ. సుబ్రహ్మణ్యం అభినందించారు. వీరంతా ఇటీవల గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాలలో



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం కోమలి చిత్ర , ఉపాధ్యాయులు

జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరపున పోటీల్లో పాల్గొననున్నట్టు హెచ్ఎం తెలిపారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై మెప్మా సిబ్బందికి శిక్షణ



మెప్మా రిసోర్స్‌పర్సన్లకి సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణలో మహిళ పాత్ర ఎంతో మార్పు తీసుకు వస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాష్ ఇన్స్టిట్యూట్ (వాష్ఐ), సాహస్ సంయుక్తంగా మున్సిపాల్టీ పరిధిలో మెప్మా రిసోర్స్‌పర్సన్స్‌కు సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంటు, స్వచ్ఛభారత్ మిషన్ 2.0 ఘన వ్యర్థాల విభజన మార్గదర్శకాలపై అవగాహన సదస్సు, సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమాన్ని కొవ్వూరు జీఎస్ రావు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మెప్మా సీఎంఎం భవాని పాల్గొన్నారు. కాపాసిటీ బిల్డింగ్ కోఆర్డినేటర్ జి.సీతారామాంజనేయరాజు, కెపాసిటీ బిల్డింగ్ రిసోర్స్‌పర్సన్ బీవీ రావు, ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ (ఐఈసీ) వాడకెళ్ల ప్రదీప్ ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, హోమ్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి అంశాలపై దృశ్య ప్రదర్శనలు, నాటక రూపకల్పనలతో వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ పట్టణం ప్రాముఖ్యత, పారిశుధ్య నిర్వహణపై ప్రసంగించారు. పాల్గొన్న 60 మంది మెప్మా రిసోర్స్‌పర్సన్స్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● రాజమహేంద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారి లత

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని రాజమహేంద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారిని కేవీపీ లత అన్నారు. కార్తీక వనసమారాధనలో భాగంగా గురువారం కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ డి.రాజేష్, పాఠ



మున్సిపల్ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఫారెస్టు అధికారులు

శాల ప్రధానోపాధ్యాయులు కే.శ్రీనివాసన్, ఉపాధ్యాయులు ఎస్.భాస్కర్‌రెడ్డి, కే.సౌజన్య, బీ.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు సహా అందరు గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు అన్నారు. జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం చంద్రవరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ఎంపీటీసీ సభ్యులు గారపాటి నరసింహమూర్తి, గ్రంథ పాలకుడు కే. సుమన్‌కుమార్, గ్రంథాలయ అభివద్ధి కమిటీ సభ్యులు మద్దిపాటి మద్దిపాటి రమేష్, సూర్యారావు, అన్నమరెడ్డి సూరిబాబు, సత్తిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రయోజకులు కావాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి



నల్లజర్లలో విద్యార్థులకు బహుమతులందిస్తున్న దృశ్యం



యర్నగూడెంలో ...

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యనభ్యసించి ప్రయోజకులు కావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, అక్షరాస్యత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మక, మేధాశక్తిని పెంపొందించే ఆలయాలు గ్రంథాలయాలన్నారు. రిటైర్డ్ ఆంధ్రా బ్యాంక్ మేనేజర్ ఎల్.శ్రీనివాస సుబ్రహ్మణ్యం గ్రంథాలయానికి రూ.6000 విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి, సూరపనేని చిన్ని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, జొడపాటి ముత్యాలరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అర్జిల్లి రామకృష్ణ, ముప్పరాజు శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను ఉపయోగించుకోవడం ద్వారా జ్ఞానం పొందవచ్చని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకర్తలకు గ్రంథాలయ చైర్మన్ గుదే సుశీల, వైస్ చైర్మన్ శ్రీరామూర్తితో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కిషోర్, ఆలీ, గ్రంథాలయ నిర్వాహకురాలు రమణ పాల్గొన్నారు.

దేవరపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన జ్ఞాన సంపదలని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు, గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి డీ.సువర్ణరాజు అన్నారు. దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా వారిద్దరు పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రతిఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 20 వరకు వివిధ వ్యాసరచన పోటీలు నిర్వహించటం జరిగిందని , ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, మండల సమాఖ్య చైర్మన్ గద్దే రమాదేవి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుంకర రామకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు పెందుర్తి రామరహిత, స్థానికులు ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్‌చంద్రబోస్, జనసేన నాయ కులు వెంకటేశ్వరరావు, దుగ్గిన లీలాగంగాధర్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే యర్నగూడెం శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స సుబ్బరాజు, గ్రామ సర్పంచ్ బొంతా భరత్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే దిశగా గ్రంథాలయాల ఆధునీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్, జూనియర్ కాలేజీ కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా రామారావు, వీర మహిళ పుట్టా జయలక్ష్మి, జనసేన నేతలు బళ్లా రాము, బీజేపీ నేత హరిప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రతాప్ కుమార్, గ్రంథాలయాధికారి అనీత, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: జ్ఞానాన్ని మరింత మెరుగు పరుచుకునేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయని పలువురు వక్తలు తమ ప్రసంగాలలో తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం తాళ్లపూడి గ్రంథాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. దీనికి మానవత సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు అధ్యక్షత వహించగా, గంథ్ర పాలకులు నరేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కవి, రచయిత జొన్నకూటి ప్రమోద్‌కుమార్ గ్రంథాలయంపై వినిపించిన కవిత అందరినీ అలరించింది. వారోత్సవాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు మానవత సంస్థ తరపున బహుమతులను సింహాద్రి జనార్దనరావు అందించారు. రిటైర్డ్ ఎంఈవో సీహెచ్ ఆంజనేయులు, మనవతా సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్, గెడ్డం సాయిబాబా, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, అంకెం సురేష్‌కుమార్, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలి : ఎంఈవో

పెరవలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలోనూ మూడు రకాల ఆలయాలు ఉంటే ఆ గ్రామం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని వీటిలో దేవాలయం, విద్యాలయం, గ్రంథాలయం ఉండాలని ఎంఈవో డీబీఎస్ స్వరూప్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా తీపర్రు, ముక్కామల, పెరవలి గ్రంథాలయాల వద్ద ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాల్లో ఎంతో విజ్ఞానం పొందవచ్చునని తద్వారా ఉన్నత స్థాపం పొందవచ్చునన్నారు. గత వారం రోజులుగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తీపర్రులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, ర్యాలీ వెంకటేశ్వరరావు, గ్రంధి శ్రీరామచంద్రరావు, కంటిపూడి సూర్యనారాయన, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, హెచ్ఎం విఘ్నేశ్వరరావు, కడియాల సాయిరామారావు, కరుటూరి విశ్వనాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు సన్మానాలు చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

రంగంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల 24వ తేదీన సమగ్రశిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ చేస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని రంగంపేట మండల పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు బీలక్ష్మి, పీవీవీ సత్యనారాయణమూర్తులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



బ్రాహ్మణునికి దీపం దానం చేస్తున్న మహిళలు

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరిరోజు కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు క్షేత్రానికి చేరుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో శివునికి మహాన్యాస పూర్వక అభిషేకాలు చేశారు. అమావాస్య తిధిని పురస్కరించుకుని మహిళలు, భక్తులు బ్రాహ్మణులకు స్వయంపాకం, సాలిగ్రామ, దీప దానాలు చేశారు. ఆలయంలో సాయంత్రం వేదపారాయణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉమాపరమేశ్వర ఆలయంలో అన్నాభిషేకం



శివాలయంలో అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా స్థానిక ఉమా పరమేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివునికి వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జంధ్యాల గంగాధర శర్మ, అశ్వనీదత్ ఆధ్వర్యంలో విశేషంగా అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

తాళ్లపూడి, నవంబరు 20 (ఆంధ్ర్యజ్యోతి): తాళ్లపూడిలోని శ్రీ పైడి ఐటీఐ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇందులో రాజేంద్ర ఎనర్జీ పవర్ సొల్యూషన్స్, ఎంటీబీ లిఫ్ట్స్, పాటిల్ గ్రూప్, క్వస్ కార్పొరేషన్ సంస్థలలో పలు ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని ఆయన చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన, 19 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకుని రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళి తెలిపారు.

జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని గోపాలపురం నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలోనే ఉంచాలని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు దున్నా సుమన్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం దేవరపల్లిలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. సుమన్‌బాబు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తుల రాజకీయ సౌలభ్యం కోసం దేవరపల్లి, గోపాలపురం మండలాలకు దాదాపు 100 కిలోమీటర్ల దూరంలోని ఏలూరు జిల్లాలో కలపడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేకపోతే నిరాహార దీక్ష చేయటానికి కూడా వెనుకడుగు వేసేది లేదని హెచ్చరించారు. జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పచ్చా రామ్‌గోపాల్, ముప్పిడి భాస్కర్‌కుమార్, మడతల శంకరం, పల్లికొండ సురేశ్, రాపాక అబ్బులు,మల్లిపూడి శాంతారావు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు



మల్లవరం పంచాయతీ కార్యదర్శి కమలావతిని అభినందిస్తున్న దృశ్యం

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, ఈవోఆర్డీ శ్రావణ్‌కుమార్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ రాజా తిలక్, వెలుగు కమ్యూనిటి కోఆర్డినేటర్ సాయిక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం కొంతమూరు భవానీపురానికి చెందిన ఎరుబండి అరుణ ఈ నెల 4వ తేదీన భర్త వెంకటసత్యనారాయణ, అత్త, మరిది వరకట్న వేధింపులు తాళలేక ఇంటిలో ఉరిపోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అరుణ గురువారం ఉదయం మృతిచెందింది. మృతురాలి తల్లి మాగాపు పుల్లారత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. తదుపరి దర్యాప్తు డీఎస్పీ చేపడతారని సీఐ తెలిపారు.

'ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషిచేయాలి'

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాలం చెల్లిన బస్సులకు స్వస్తి పలికి హైద్రాబాద్, విశాఖపట్టణం వంటి దూరప్రాంతాలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సులు నడపాలని పట్టణ ప్రజా సంక్షేమ సంఘం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. గురువారం నిడదవోలు పట్టణం లోని ఆర్టీసీ డిపో మేనేజర్ టీ.ధనుంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నిడదవోలు నుంచి హైద్రాబాద్‌కు కాలం చెల్లిన బస్సులు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని నియోజకవర్గ కేంద్రమైన నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి కొత్త సూపర్ లగ్జరీ బస్సులు నడపాలన్నారు. ముఖ్యంగా ఏలూరు, పోలవరం, జంగారెడ్డిగూడెంలకు సర్వీసులు క్రమపద్ధతిలో నడపడం



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

లేదని ఆఖరి నిమిషంలో సర్వీసు రద్దు చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆర్టీసీ డిపో అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అంబటి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంతో దిగుబడి అంచనా సులభం

● మండల వ్యవసాయాధికారి ఏసుబాబు

గోపాలపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగంతో పంట దిగుబడి సులభంగా అంచనా వేయవచ్చని మండల వ్యవసాయాధికారి ఏసుబాబు అన్నారు. మండలంలోని తానాల మధుసూదనరావు పొలంలో గురువారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటకోత ప్రయోగం ద్వారాపంట దిగుబడి అంచనా వేయడంతో పాటు ఆ ప్రాంతంలో సాధారణ దిగుబడి కూడా అంచనా వేయవచ్చన్నారు. తానాల మధుసూదనరావు పొలంలో ఎకరానికి 29బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇప్పటి వరకు మండలంలో 48 పంటకోత ప్రయోగాలు చేసినట్లు ఆయన తెలిపారు. వాటిలో నాలుగు వరి, 8 చెరుకు, 6 మినుము ప్రయోగాలు చేశామన్నారు. మిగిలిన



చిట్యాలలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రయోగాలను డిసెంబరు నెలఖరునాటికి పూర్తి అవుతాయన్నారు. రైతులు పంటకోత ప్రయోగంలో పాల్గొని తమ పంటల దిగుబడులు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, రైతులు, ఉద్యానవన సహాయకులు రామకృష్ణ, ఇన్సూరెన్స్ ఏజెంట్ శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో రాజశేఖర్‌కు స్వర్ణపతకం



దేవరపల్లిలో రాజశేఖర్‌ను సత్కరిస్తున్న జేఏసీ కమిటీ సభ్యులు

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం గౌరీపట్నంకు చెందిన గెల్లా రాజశేఖర్ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొని స్వర్ణపతకం సాధించినట్టు గురువారం ఆయన విలేఖరులకు తెలిపారు. ఈ సందర్భంగా దేవరపల్లిలో మాట్లాడుతూ భూటాన్ దేశం థింపూలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన ఎస్‌టీకేఎఫ్ 12వ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ఇంకా మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించటమే తన కోరికన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగిన చదరంగ పోటీల్లో తాను పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించానని తెలిపారు. కాగా, ఇటీవల గోవాలో జరిగిన చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించానని, నెల్లూరులో జరిగిన పోటీల్లో వివిధ బహుమతులు సాధించినట్టు తెలిపారు. తాను చదరంగం పోటీల్లో ఎంతో శిక్షణ పొంది దీన్ని సాధించినట్టు తెలిపారు. భారత్ తరపున అంతర్జాతీయ స్థాయిలో చెస్ పోటీల్లో పాల్గొని గౌరవం తీసుకురావాలనే తపన తనలో ఉందన్నారు. ప్రస్తుతం తాను రాజమండ్రిలోని గోల్డ్‌జిమ్‌లో ప్రథమ కోచ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు రాజశేఖర్‌ను గురువారం దేవరపల్లిలో జేఏసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు దున్న సుమన్ బాబు, పచ్చా రామ్‌గోపాల్, మడతల శంకరం, ముప్పిడి భాస్కర్‌కుమార్, పల్లికొండ సురేష్ కుమార్, రాపాక అబ్బులు, మల్లిపూడి శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చిహ్నాలుగా పంచాయతీలు

● జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయితీలలో పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి అధికారులంతా దృష్టి సారించి పరిశుభ్రతకు చిహ్నాలుగా గ్రామాలను నిలపాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. గురువారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పన్నుల వసూళ్లపై పంచాయతీ అధికార్లు దృష్టిసారించాలన్నారు. అనంతరం నిడదవోలు మండలం విజ్జేశ్వరం, గోపవరం గ్రామాల్లో



సమిశ్రగూడెంలో సమీక్ష నిర్వహిస్తున్న డీపీవో శాంతామణి

నిర్వహించిన సర్వేలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సత్యనారాయణ, కె.శ్రీనివాస రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషిచేయాలి

● ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డ్వాక్రా ఈవోఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్ల పై చెత్తాచెదారం ఎక్కడికక్కడ వేయరాదని, పారిశుధ్య కార్యక్రమాల పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలతో గ్రామాల్లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ఇద్దరు ఈవోలను సభ్యులుగా ఇవ్వడం జరిగిందని కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాజారావు, రిసోర్స్‌పర్సన్ హరీష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ శాంతి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో కొట్టి ఓ వ్యక్తిని గాయపర్చిన సంఘటనలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం శ్రీరామకాలనీకి చెందిన బొండాడ సురేష్, అతని స్నేహితుడు అల్లబాని శివ ఇద్దరూ కలిసి ఈనెల 20వ తేదీ తెల్లవారుజాము 3 గంటల ప్రాంతంలో మద్యం సేవిస్తుండగా, ఇంతలో గతంలో తీసుకున్న బాకీ కోసం అడగడంతో చేతిలో ఉన్న బీరు బాటిల్ పగలగొట్టి సురేష్‌పై శివ దాడి చేశాడు. దీంతో సురేష్ కంఠం, మెడపై తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

చిరు వ్యాపారులకు రుణాలు

● మెప్మా పీడీ కనకరాజు

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీఎం స్వానిధి పథకంలో చిరువ్యాపారులకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు మెప్మా పీడీ కనకరాజు తెలిపారు. కొవ్వూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రుణాలు మంజూరైన లబ్ధిదారులకు గురువారం పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాలలో పీఎం స్వానిధి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎంసీ పరిధిలో 141 యూనిట్స్ ద్వారా రూ. 25.05 లక్షలు, కొవ్వూరులో 54 యూనిట్స్ రూ. 12.15 లక్షలు, నిడదవోలులో 25 యూనిట్స్ రూ. 7.35 లక్షలు గ్రౌండింగ్ చేసినట్టు తెలిపారు. మొత్తం 312 యూనిట్స్‌కి రూ. 43015 లక్షలకు గాను 221 యూనిట్స్ ద్వారా రూ.21.75 లక్షలు చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రతి బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నీలాంబర్, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రోటరీ కల్యాణ మండపం ఆవరణలో మున్సిపల్, మెప్మా సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి సిబ్బంది వేసిన ముగ్గులను పరిశీలించారు. విజేతలకు ఈ నెలాఖరున జరిగే వజ్రోత్సవ వేడుకల్లో బహుమతులు అందించనున్నారు.